ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

శుక్రవారం 29 నవంబరు 2024 | 5



జ్యోతి రావు పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

మామూళ్లతో 'చెక్'

- కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు దర్జాగా రేషన్ బియ్యం అక్రమ రవాణా
- పేరుకు రెండు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఉన్నా తనిఖీలు తూతూమంత్రమే
- రాత్రివేళ తనిఖీలు లేకపోవడంతో అక్రమార్కులకు కలిసివస్తోన్న వైనం
- అటు కొందరు చెక్‌పోస్టు సిబ్బందితో బియ్యం వ్యాపారుల మిలాఖత్
- చెక్‌పోస్టు సిబ్బందికి ఏ లారీల్లో రేషన్ బియ్యం వస్తుందో ముందే లీకులు
- చూసీచూడనట్టు వదిలేయడానికి దండిగా మామూళ్ల చదివింపులు
- చెక్‌పోస్టులు ఏర్పాటైన కొత్తలో ప్రతి లారీలోను రేషన్ ఆనవాళ్లపై తనిఖీలు
- ఇప్పుడు ఇరవై లారీలకు కనీసం నాలుగింటిలో కూడా తనిఖీలు నిల్
- రేషన్ అక్రమ రవాణా అరికట్టడానికి కలెక్టర్ ప్రయత్నిస్తున్నా వారిదే పైచేయి



కాకినాడ నుంచి రేషన్ బియ్యం విదేశాలకు అక్రమ రవాణా అవకుండా ఎన్ని చర్యలు తీసుకుంటున్నా అక్రమార్కులు ఆగడం లేదు. రకరకాల దారుల్లో కళ్లుగప్పి దర్జాగా కోట్ల విలువైన పేదల బియ్యాన్ని సముద్రాలను దాటించేస్తున్నారు. మాఫియా అంతుచూడడానికి ఎన్ని వ్యూహాలు అమలు చేస్తున్నా వాటిని ఎంచక్కా దాటుకుని వెళ్లిపోతున్నారు. చివరకు పేదల బియ్యాన్ని పసిగట్టడానికి ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు సైతం మాఫియాను ఆపలేకపోతున్నాయి. పోర్టుకు వెళ్లే రేషన్ బియ్యాన్ని పసిగట్టడానికి ఏర్పాటు చేసిన రెండు సమీకృత చెక్‌పోస్టులు పూర్తిగా మొక్కుబడిగా మారాయి. రాత్రివేళ పూర్తిగా తనిఖీలు ఆపేయడం అక్రమార్కులకు బాగా కలిసివస్తోంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ కేంద్రంగా రేషన్‌బియ్యం మాఫియా వైసీపీ అయిదేళ్ల పాలనలో పేట్రేగిపోయింది. స్వయంగా కాకినాడ వైసీపీ కీలక నేత కుటుంబం ఈ వ్యాపారంలో ఎన్నో ఏళ్లగా పాతుకుపోవడంతో యథేచ్ఛగా బియ్యాన్ని విదేశాలను దాటించేస్తోంది. ఈయన అనుచరుల మిల్లుల్లో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ బియ్యం తెచ్చి పాలిష్ చేసి విదేశాలకు ఏ తనిఖీలు లేకుండా తరలించేస్తూ వందల కోట్లలో సంపాదించారు. గత సర్కారు తమ కనుసన్నల్లోనే ఉండడంతో అధికార వ్యవస్థలన్నీ వీరికి సలాం కొట్టాయి. దీంతో ప్రభుత్వం కిలో రూ.44కు కొనుగోలు చేసే రేషన్ బియ్యాన్ని రూ.12కు నల్ల మార్కెట్‌లో కొనుగోలుచేసి పాలిష్ చేసి వేరే బ్రాండ్ పేరుతో విదేశాలకు అడ్డగోలుగా తరలించేశారు. ఇదిచాలక సదరు నేత విదేశాల్లో గోదాములు కట్టి బియ్యం నిల్వలు కూడా చేస్తున్నారు. ఇలా కొన్ని వందల కోట్ల విలువైన రేషన్‌బియ్యం గడచిన కొన్నేళ్లలో కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు ఎగిరిపోయింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ బియ్యం ఎగుమతిపై ఉక్కుపాదం మోపింది. అప్పటికే గోదాముల్లో ఉన్న రేషన్‌బియ్యం నిల్వలపై పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల స్వయంగా తనిఖీలు చేశారు. ఆయన ఆదేశాలతో జిల్లాలో అనేక గోదాముల్లో అధికారులు తనిఖీలు చేశారు. మొత్తం రూ.215 కోట్ల విలువైన 51,427 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. ల్యాబ్‌కు పంపిన శాంపిళ్లలో 12,184 మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ బియ్యంగా నిర్ధారించారు. ఈనేపథ్యంలో రేషన్ మాఫియాను అరికట్టడం కోసం కాకినాడపోర్టుకు వెళ్లే దారిలో రెండుచోట్ల సమీకృత చెక్‌పోస్టులను ఏర్పాటుచేయాలని కలెక్టర్ శాన్‌మోహన్ నిర్ణయం తీసుకున్నారు. రోజుకు మూడు షిఫ్ట్‌ల్లో వీటిని పనిచేసేలా రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ, పోలీసు సిబ్బందిని నియమించారు. పోర్టుకు బియ్యం లోడుతో వెళ్లే ప్రతిలారీని తనిఖీ చేసి రేషన్‌బియ్యం ఆనవాళ్లు గుర్తించాలని ఆదేశించారు. దీంతో రేషన్‌బియ్యం విదేశాలకు అక్రమంగా తరలడం ఆగుతుందని అంతా భావించారు.

చెక్‌పోస్టులకు అవినీతి చెదలు...

పోర్టుకు వెళ్లే దారిలో బొంబాయి కాటా, శక్తిగ్యాస్ సెంటర్ వద్ద ప్రభుత్వం ఆగస్టులో రెండు సమీకృత చెక్‌పోస్టులను ఏర్పాటుచేసింది. ఇందులో రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ, పోర్టు, పోలీసు తదితర విభాగాలతో కూడిన సిబ్బందిని నియమించి రోజుకు మూడు షిఫ్టుల్లో దాదాపు 1,100 లారీలను ఈ చెక్ పోస్టుల్లో తనిఖీలు చేసేవారు. పోర్టులోపలకు బియ్యం లోడుతో వెళ్లే ప్రతి లారీ నుంచి బియ్యం శాంపిళ్లను తీసుకుని అక్కడికక్కడ ప్రత్యేక రసాయనం ద్వారా రేషన్‌బియ్యం ఎగుమతి అవుతున్నాయో లేదో తనిఖీ చేసేవారు. అయితే ఈ చెక్‌పోస్టుల వల్ల బియ్యం ఎగుమతులు ఆలస్యమవుతున్నాయంటూ అప్పట్లో వ్యాపారులు ఆందోళన చేయించారు. దీంతో అప్పటినుంచీ ఇవి నామ్‌కే వాస్తుగా తయారయ్యాయి. మూడు పూటలా పనిచేసే చెక్‌పోస్టులు రాత్రివేళల్లో తనిఖీలు చేయించడం నిలిపివేయించారు. దీంతో ఉదయం 8గంటల నుంచి రాత్రి 9గంటల వరకే రెండు షిఫ్టుల్లో ఇవి పనిచేస్తున్నాయి. దీంతో రాత్రివేళ లారీల్లో బియ్యం తనిఖీలు ఆగిపోవడం అక్రమార్కులకు కలిసి వస్తోంది. వందలాది లారీలు ఎంచక్కా అర్ధరాత్రివేళ గుట్టుగా పోర్టులోకి వెళ్లిపోతున్నాయి. ఇందులో రేషన్ బియ్యం ఉన్నా పట్టించుకునే నాథుడు లేడు. మరోపక్క చెక్‌పోస్టులు ఏర్పాటు చేసిన కొత్తలో ప్రతి లారీని తనిఖీ చేసి శాంపిళ్లు తీసుకునేవారు. కానీ ఇప్పుడు ఇరవై లారీలు పోర్టులోకి వెళ్తే అందులో రెండు లేదా మూడు లారీలనే తనిఖీచేసి పంపేస్తున్నారు. దీంతో అక్రమార్కులకు పని సులువయింది. ఇదంతా ఒకెత్తయితే చెక్‌పోస్టుల్లో మొదట్లో ఉన్న సిబ్బంది హడావుడి పూర్తిగా పోయింది. అధికారులు కూడా సిబ్బందిని కుదించి ఇప్పుడు కేవలం ముగ్గురినే కొనసాగిస్తున్నారు. ఇందులో ఒకరు వీఆర్వో, మరొకరు పౌరసరఫరాలశాఖకు చెందిన సీఎస్‌డీటీ, మరొకరు టెక్నికల్ అసిస్టెంట్ మాత్రమే ఉంటున్నారు. అయితే ఏ చెక్‌పోస్టులో ఎవరు విధిలో ఉంటున్నారో వారి ఫోన్ నెంబర్లతో సహా ఏకంగా బియ్యం ఎగుమతిదారుల చేతికి నిమిషాల్లో వచ్చేస్తోంది. దీంతో సదరు సిబ్బందితో అక్రమార్కులు కుమ్మక్కైపోతున్నారు. తమవి పది లారీలు వస్తున్నాయంటూ ముందే కొందరు చెక్‌పోస్టు సిబ్బందికి సమాచారం అందిస్తున్నారు. ఇందుకు భారీగానే మామూళ్లు తడుపుతున్నారు. దీంతో వీటిని దర్జాగా లోపలకు పంపేస్తున్నారు. దీంతో ఇక్కడ డ్యూటీ కోసం పోటీ కూడా నెలకొంది. మరోపక్క ఈ మామూళ్లలో కొంత పౌరసరఫరాలశాఖ కీలక అధికారి స్థాయి వరకు అందుతున్నాయి. ఇదంతా ఒకెత్తయితే రేషన్ బియ్యం విదేశాలకు అక్రమ ఎగుమతి విషయంలో ఇప్పటికీ జిల్లా పౌరసరఫరాలశాఖలో కొందరు సిబ్బంది నుంచి పూర్తి సహకారం అందుతోంది. ఈ శాఖ కీలక అధికారి గత ప్రభుత్వంలో నియమితులవడంతో అక్రమార్కుల విషయంలో గట్టిగా వ్యవహరించ లేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మహోన్నతుడు జ్యోతిరావు పూలే

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల హక్కుల కోసం, స్త్రీవిద్యా కోసం అహర్నిశలు పోరాడిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతి పురస్కరించుకుని గురువారం కాకినాడలోని ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి కూడలి వద్ద ఉన్న పూలే విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిరావు పూలే అంటరానివారికి, అట్టడుగువర్గాల ప్రజలకు, సాంఘిక న్యాయం కోసం సమాన హక్కుల కోసం సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించిన గొప్ప వ్యక్తి అన్నారు. బాల్య వివాహాలు, సతీసహగమనం వంటి దురాచారాలకు వ్యతిరేకంగా ఆయన అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి లల్లి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీవాసరావు, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ డీడీ నాగార్జున, కాకినాడ డివిజన్ బీసీ సంక్షేమ సహాయ అధికారి సుబ్బారావు, జిల్లా బీసీ సంక్షేమ కార్యాలయ పర్యవేక్షకులు, వసతి గృహ సంక్షేమ అధికారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.





పిఠాపురం హైవేలో రైతుల జాగ్రత్తలు

వర్షాల ముప్పుతో రైతుల్లో గుబులు

సామర్లకోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అన్నదాతల్లో కలవరం మొదలైంది. మాసూళ్ల దశలో ఉన్న వరి పంటను దక్కించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. వరి పనలను గట్టుకు చేర్చడం, కుప్పలుగా వేసే పనులు చేపట్టారు. అయితే చేతికందిన ధాన్యాన్ని ప్రభుత్వం సకాలంలో కొనుగోలుచేయక, ఉన్న ధాన్యాన్ని భద్రపరచలేక సతమతమవుతున్న రైతాంగానికి ప్రభుత్వం తాజాగా ఊరటనిస్తూ 25 శాతం తేమ ఉన్నప్పటికీ ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని ప్రకటించింది. అలాగే తేమశాతం ఒక్కొక్క పాయింట్‌కు కేవలం ఒక కిలో తరుగు మాత్రమే రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించాలని సివిల్ సప్లయ్ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. దీంతో ఇప్పటివరకూ బస్తాకు పది కిలోల చొప్పున నష్టపోతున్న రైతులకు ప్రభుత్వ ప్రకటనతో కాసింత భరోసా లభించినట్టైంది. కాగా ఫెంగల్ తుఫాను ప్రభావంతో మబ్బులు, చలి గాలులుతో కూడిన వాతావరణం ఉండడంతో పంట మాసూళ్లు తాత్కాలికంగా నిలుపుదల చేయాలని ప్రభుత్వం కోరింది. దీంతో చేలో ఉన్న పనలను రక్షించుకునే చర్యలు రైతులు చేపట్టారు.



గండేపల్లి మండలం నాయకంపల్లిలో భారతీ మహాస్వామి అభిభాషణం

జిల్లాలో శృంగేరీ పీఠాధిపతి విధు శేఖర భారతీ మహాస్వామి పర్యటన

6

డిసెంబరు 5న నీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్

డిసెంబరు 8న నీటి సంఘాలు, 11న డిస్ట్రిబ్యూటరీ, 14న ప్రాజెక్ట్ కమిటీలకు ఎన్నికలు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు28 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 5వ తేదీన జిల్లాలో నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలవుతుంది. ఈ మేరకు కలెక్టరేట్ అధికారులు సర్వంసిద్ధం చేశారు. డిసెంబరు 8న నీటి సంఘాలకు, ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతాయి. అలాగే డిసెంబరు 11వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. డిసెంబరు 14న ప్రాజెక్ట్ కమిటీలకు ఎన్నికలు జరుగుతాయి. ఈఎన్నికల్లో అధ్యక్షులను, ఉపాధ్యక్షులను, సభ్యులను ఎన్నుకుంటారు. జిల్లాలో ఉన్న గోదావరి ఈస్టర్న్ డెల్టా, ఏలేరు, పుష్కర, తాండవ, పంపా, సుబ్బారెడ్డి సాగర్, మైనర్, మేనేర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో ఎన్నికలు జరిపేందుకు అధికారులు సర్వం సిద్ధంచేశారు.

గోదారి.. మారుతుందోచ్!




అఖండ గోదావరికి పర్యాటక కళ

- పర్యాటక నిధుల ప్రవాహం
- తొలి విడతగా రూ.62 కోట్లు
- మారనున్న హేవలాక్ వంతెన
- ఇక మల్టీ ఫంక్షనల్ టూరిస్ట్ హబ్
- ఆధ్యాత్మిక కేంద్రంగా పుష్కరఘాట్
- కడియం నర్సరీలకు శోభ
- విజ్జేశ్వరం కాలువలో బోట్ షికార్
- త్వరలో టెండర్లు ఆహ్వానం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అఖండ గోదావరికి పర్యాటక కళ రానుంది. వచ్చే పుష్కరాలకు హేవలాక్ బ్రిడ్జి, పుష్కర ఘాట్, కడియం నర్సరీలు, విజ్జేశ్వరం-నిడదవోలు కాల్వ, కోటసత్తెమ్మ గుడి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చెందనున్నాయి. అఖండ గోదావరి ప్రాజెక్టుకు రూ.94.44 కోట్లు మంజూరుకాగా అందులో కేంద్ర ప్రభుత్వం స్పెషల్ అసిస్టెంట్స్ టు స్టేట్ క్యాపిటల్ ఇన్వెస్టిమెంట్ (సాస్కి) పథకం కింద రూ.62 కోట్లు విడుదలచేసింది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కృషితో ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందనుంది.



హేవలాక్ బ్రిడ్జి

రాజమహేంద్రవరం-కొవ్వూరు మధ్య గోదావరిపై నిర్మించిన మొదట రైల్వే బ్రిడ్జిని మల్టీ ఫంక్షనల్ టూరిస్ట్ హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. 127 ఏళ్ల ఈ బ్రిడ్జిని చారిత్రక కట్టడంగా తీర్చిదిద్దాలని ప్రజలు ఎన్నో ఏళ్ల నుంచి కోరుతున్నారు. ఈ మేరకు రెండు దశాబ్దాల కిందట అప్పట్లో సీఎం చంద్రబాబు చొరవతో రైల్వేశాఖకు రూ.10 కోట్లు చెల్లించి బ్రిడ్జిని స్వాధీనం చేసుకున్నారు. గత పుష్కరాల సమయంలో అప్పటి సీఎంగా చంద్రబాబు అఖండగోదావరి ప్రాజెక్టు కింద హేవలాక్ బ్రిడ్జి, గోదావరి లంకలు, ఘాట్లు అభివృద్ధి చేయాలని ప్రయత్నించారు. రూ.100 కోట్లు కేటాయించారు. రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి రీజనల్ కార్యాలయం ఏర్పాటుచేశారు. తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ అఖండ గోదావరి ప్రాజెక్టును ఎత్తేసింది. పర్యాటక కళలను ధ్వంసం చేసింది. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో అఖండ గోదావరికి మళ్లీ జీవంపోసింది. 2,700 మీటర్ల పొడవుతో 18 స్పాన్స్‌తో ఉన్న హేవలాక్ బ్రిడ్జిని సాసి పథకం కింద మల్టీఫం క్షనల్ టూరిస్ట్ హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. థీమేటిక్, బఫర్ జోన్లుగా విభజించారు. థీమేటిక్ జోన్‌లో వాటర్‌ఫాల్, గ్లాస్ బ్రిడ్జిలు, ఎస్పేస్ థీమ్డ్ జన్, అర్బన్‌హాట్, అక్వేరియం టన్నెల్స్ ఇతర సౌకర్యాలు కల్పిస్తారు. బఫర్‌జోన్‌లో గోదావరిని వ్యూ పాయింట్ నుంచి చూసేలా అభివృద్ధి చేస్తారు.



కడియంలో కన్వెన్షన్ సెంటర్..

ఇప్పటికే ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న కడియం నర్సరీలకు మరింత పర్యాటక శోభ రానుంది. కడియపులంకలో కన్వెన్షన్ సెంటర్ నిర్మించనున్నారు. నర్సరీలలో ఒక నర్సరీ నుంచి మరో నర్సరీకి వెళ్లి తిలకించేలా ఏర్పాట్లు చేయనున్నారు. పొట్టిలంక, కడియపులంక, వేమగిరి మధ్య బోట్ షికారు ఏర్పాటుచేసి, నర్సరీలు సందర్శించేలా తీర్చిదిద్దనున్నారు. డిజైన్లను ధవళేశ్వరానికి చెందిన ఆర్కిటెక్ట్ భమిడిపాటి కిరణ్ రూపొందించారు.

సమిశ్రగూడెం కాలువలో..


నిడదవోలు కోటసత్తెమ్మ గుడికి మరింత ప్రాధాన్యత సంతరించేలా ఇక్కడ టూరిజాన్ని అభివృద్ధి చేయనున్నారు. నిడదవోలు ఎమ్మెల్యే, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా ఇక్కడ ప్రతిపాదన చేయడంతోపాటు నిధులు మంజూరు చేయించారు. విజ్జేశ్వరం నుంచి నిడదవోలు గుండా వెళ్లే ప్రధాన పంట కాలువలో సమిశ్రగూడెం వద్ద కాలువలో బోటు షికారు ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ రెస్టారెంట్ సిద్ధం చేయనున్నారు.



గోదావరి హరివిల్లు.. బోట్ హౌస్

పుష్కర ఘాట్ అభివృద్ధి

ఆధ్యాత్మిక కేంద్రంగా పుష్కరఘాట్ తీర్చిదిద్దనున్నారు. గోదావరి మాత గుడిని నిర్మించనున్నారు. ఇక్కడ శివపార్వతులు, వినాయక, కార్తికేయ ఆలయాలు నిర్మించనున్నారు. నక్షత్ర స్తంభాలు దివ్యత్వం ఉట్టిపడేటట్టు గోదావరి, ఆస్ట్రాలాజికల్ స్టార్స్ నిర్మించనున్నారు. మండపాలు, మెడిటేషన్, స్పిరిట్యువల్, వాణిజ్య సౌకర్యాలు కల్పించనున్నారు.



వచ్చే పుష్కరాలకు రూపురేఖలు మారుస్తాం..



కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని రెండు పర్యాటక ప్రాజెక్టులకు రూ. 113.751 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులిచ్చింది. అఖండగోదావరికి, గండికోట ప్రాజెక్టుకు కలిపి మొత్తం రూ.177 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం. వచ్చే పుష్కరాలకే రూపురేఖలు మారతాయి.

- కందుల దుర్గేష్, పర్యాటక శాఖ మంత్రి



సాయుధ దళాల పతాక దినోత్సవం పోస్టల్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

సాయుధ దళాల పతాక పోస్టర్ ఆవిష్కరణ

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు28 (ఆంధ్రజ్యోతి): సాయుధ బలగాల జెండా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్ సాయుధ దళాల పతాక దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయుధ దళాల పతాక దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబరు 7న నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. మాజీ సైనికులు, యుద్ధ వితంతువులు సంక్షేమ కోసం ఫ్లాగ్‌డే సందర్భంగా మనం అందించే విరాళాలు ఒక మంచి కార్యక్రమం కోసం సద్వినియోగం చేసుకోవడం జరుగుతుందన్నారు. విరాళాలు అందించేవారు జిల్లా సైనిక్ సంక్షేమ కార్యాలయం వారి పేరు మీద స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, జిల్లా పరిషత్‌శాఖ, కాకినాడ బ్రాంచ్‌లోని ఖాతా సంఖ్య 620640 60623 ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0020974 జమ చేయవచ్చునన్నారు.

వీవీఎంలకు పటిష్ట భద్రత

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు28(ఆంధ్రజ్యోతి): వీవీప్యాట్ ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల)లకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదామును రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల ఈవీఎం, వీవీప్యాట్ గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్టు వెల్లడించారు. ఆర్డీవో మల్లిబాబు, కాకినాడ అర్బన్ తహశీల్దార్ జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథం పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంఎస్‌ఎంఈల పనితీరుపై సర్వే

కలెక్టరేట్(కాకినాడ),నవంబరు28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నుంచి ఎంఎస్‌ఎంఈల పనితీరుపై సర్వే ప్రారంభమై వచ్చే ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మా ఊరు.. 'మొగళ్లమూరు'




మొగలి పుష్పాలే ఊరు పేరు
ఊరంతా మొగలి చెట్లే




సువాసన ఇచ్చే పూలు ఎన్నున్నా మొగలి పువ్వులు ప్రత్యేకత వేరు. ముళ్లతో ఏమాత్రం తాకడానికి వీలుకాని రీతిలో ఉండే ఈ చెట్లకు పూసే పూలు ఆ ప్రాంతమంతా సుగంధ పరిమళాలను వెదజల్లుతాయి. ఇది వరకు ఊరారూ పొలాలకు వెళ్లే దారిలో మొగలి చెట్లు కనిపించేవి. ఇప్పుడు వాటి జాడే సరిగా కనిపించడం లేదు. అయితే అసలు ఈ మొగలి పూల పేరుతోనే ఒక ఊరుంది. ఆ ఊరి పేరు 'మొగళ్లమూరు'. పేరుకు తగ్గట్టు ఇప్పటికీ మొగలి చెట్లకు నెలవుగా ఆ ఊరు పరిమళిస్తోంది.

సువాసనలు వెద జల్లే మొగలి పుష్పాలకు ఉన్న ఆకర్షణ వేరు. పువ్వు లంటే ఇష్టపడే వారంతా మొగలి పూలంటే ఇంకా ఇష్టపడ తారు. ఇలా మొగలి పూల పేరుతో ఒక ఊరే ఉంది. అది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అల్లవరం మండలం మొగళ్లమూరు. మొగలి పొదలు అధికంగా ఉన్న ప్రాంతం కావడంతో దీనికి ఆ పేరు స్థిరపడినట్టు చెబుతారు. ఇప్పటికీ అతిపొడవైన మొగలి పుష్పాల చెట్లతో కూడిన పొదలు చాలా ఉన్నాయి. ముళ్ల కలిగి పచ్చని ఆకులతో ఉండే మొగలి చెట్లు కాండంపై శివారు భాగాన పసుపు రంగు కలిగి సువాసనలు వెదజల్లే మొగలి పుష్పాలు పూస్తాయి. ఈ మొగలి పుష్పాల పొప్పిడి పుష్పాల రేకుల నుంచి అత్తర్లు, అగరవత్తులు తయారు చేస్తా రు. అలాగే చిన్నసైజు తొండాల వలే కాండాలకు వేలాడే వేరు భాగాలను కోసి నారా తీసి బుట్టల అలికకు ఉపయోగిస్తారు. పడిపోయిన కాండం ముక్కలతో కాలువలు, చెరువుల్లో నీటి అడుగున ఉంచి దొందులు, బొమ్మిడాయిలు, కొరమేను చేపలు పట్టడానికి ఉపయోగిస్తారు. మొగళ్లమూరు, కొమరగిరిపట్నం, ఓడలరేవు గ్రామాల్లో ఈ చెట్లు నేటికి కనిపిస్తున్నాయి. మొగలి పుష్పాలు పెళ్లిళ్ల, శుభాకార్యాల్లో అలంకారాలకు మంచి డిమాండ్ ఉంది. - అల్లవరం

రుచిలో జీడిపప్పు రారాజు. ఏ వంటకం తయారులోనైనా జీడిపప్పు కలిసిందంటే దాని టేస్టే మారిపోతుంది. ఇక విడిగా జీడిపప్పునే స్నాక్ ఐటమ్స్‌గా తినడం చాలామందికి ఇష్టం. బెల్లంపాకంతో పట్టిన జీడిపప్పు అచ్చుకి యమా క్రేజు. కారంగా కరకరలాడుతూ ఉండే 'రోస్టెడ్ కాజు' తింటే ఆహా అనాల్సిందే. ఇవి ఎక్కడైనా దొరుకుతాయిగానీ, జీడిపప్పు ప్రాసెసింగ్ పరిశ్రమ కేంద్రం అయిన మోరిలో తయారయ్యే జీడిపప్పు స్వీటు, హాటుకు ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు.



తింటే మర్చిపోరు.. మోరి జీడిపప్పు అచ్చులు



రుచిలో అమోఘం బెల్లం అచ్చులు.. కరకరలాడే స్పైసీ, రోస్టెడ్ కాజులోనూ స్పెషల్

తీయదనం.. కమ్మదనంతో నోటికి కరకరలాడే మోరి జీడిపప్పు ఎంతో రుచికరం. ఆరోగ్యకరం. జీడిపప్పు ప్రాసెసింగ్ పరిశ్రమలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలో మోరి గ్రామానికి రాష్ట్రంలోనే పేరుంది. ఇక్కడ నుంచి దేశవిదేశాలకు జీడిపప్పు ఎగుమతులు జరుగుతుంటాయి. ఇక్కడ నెంబర్ వన్ క్వాలిటీ మోరి జీడిపప్పు కిలో రూ.850 ధర పలుకగా, ఆ జీడిపప్పును వివాహాది శుభకార్యాలు, విందు భోజనాల్లో కూరల్లో ఉపయోగిస్తుంటారు. మోరి జీడిపప్పు వల్ల ఆ వంటలు రుచికరంగాను, అమోఘంగా ఉంటాయని భోజన ప్రియులు చెబుతారు. ఆ మోరి జీడిపప్పును ఇటీవల సారెల్లోను, స్వీట్లు, అచ్చుల రూపంలో బెల్లం పాకంతో తయారుచేసి విక్రయిస్తున్నారు. నిశ్చయ తాంబూలాలు, వివాహాది శుభాకాంక్షలు తెలిపేటప్పుడు హృదయాకారంలో అచ్చులను తయారుచేసి స్వీట్లు బాక్సుల్లో అందిస్తున్నారు. తోటి స్నేహితులు, బంధువులు, ఉన్నతాధికారులు వీటిని రుచి చూసిన అనంతరం మళ్లీ తమకు మోరి జీడిపప్పు అచ్చులు కావాలని తెప్పించుకుంటూ ఉంటారు. బెల్లం పాకం పట్టిన జీడిపప్పు అచ్చు రూ.750 ధర ఉండగా, స్పైసీ, రోస్టెడ్ జీడిపప్పు కిలో రూ.950 ధర పలుకుతుంది. మోరిలో ప్రధానంగా బెల్లంపాకంతో తయారుచేసే కంగుట్ల రామారావు వంద గ్రాముల నుంచి కిలోల లెక్కన ఎన్ని ఆర్డర్లు వచ్చినా ఉదయం పూట తయారుచేసి అప్పటికప్పుడు అందివ్వడంతో మోరి జీడిపప్పును రుచిచూసిన వారందరూ ఆహా ఏమి రుచి అని కితాబిస్తున్నారు. ఇటీవల కాలంలో విందు భోజనాల్లో జీడిపప్పు లేని వంటకం లేదు. ఈ జీడిపప్పు తయారీపై చిన్నా పెద్దా తేడా లేకుండా మోరి గ్రామ ప్రజలంతా ఉపాధి పొందుతున్నారు. మోరికి ఆనుకుని ఉన్న ఇతర గ్రామాల వారు కూడా జీడిపప్పు తయారీలో భాగస్వాములై లబ్ధి పొందుతున్నారు. - అంతర్వేది





పుట్టినరోజులు, పెళ్లిరోజులు, శుభకార్యాల కోసం హృదయాకారంలో జీడిపప్పు అచ్చు

పచ్చబొట్టేసినా...



- టాటూలకు విశేష ఆదరణ
- నాటి పచ్చబొట్టు ... నేడు టాటూ
- వివిధ ఆకృతుల్లో శరీరంపై ముద్ర
- ఆసక్తి కనబరుస్తున్న యువత

పచ్చబొట్టు చెరిగిపోదులే నా రాజా అని పలకరించినా.. పచ్చబొట్టేసినా పిల్లగాడా నిన్ను.. అంటూ పులకరించినా గుండెల నిండా చెదిరిపోని ప్రేమావేశానికి నిదర్శనమది. అదిప్పుడు ఒళ్లంతా చెరగని ముద్రవేసుకుంటోంది. నిన్నటి పచ్చబొట్టు నేడు టాటూగా ఆకర్షించి ఆదరణ పొందుతోంది. ఇష్టమైన వాళ్ల రూపాన్ని, పేర్లని అందమైన ఆకృతులతోపాటు వివిధ రకాల జంతువులు, పక్షులన్నీ రమణీయంగా ఒళ్లంతా ఆవిష్కరిస్తోంది. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు టాటూలకు మొగ్గుచూపుతుండడంతో ప్రస్తుతం టాటూల ట్రెండ్ నడుస్తోంది. రెండు దశాబ్దాల కిందటి వరకు ఇష్టమైన పేర్లు, ఆకారాలను పచ్చరూపంలో పొడిపించుకునేవారు. ఈ విధానం పూర్తిగా నాటు పద్ధతిలో ఉండేది. పచ్చపొడుపించుకున్న వారు రెండ్రోజులపాటు జ్వరంతో బాధపడే పరిస్థితి ఉండేది. ఈ విధానం కనుమరుగైంది. ఇదే తరుణంలో టాటూ సంస్కృతి విస్తృతంగా వ్యాప్తించింది.

సూదులతో పచ్చబొట్టు...

యువతను ఆకర్షించేందుకు సినిమా థియేటర్ల వద్ద పచ్చబొట్టు పొడిచేవారు సిద్ధంగా ఉంటున్నారు. ముందుగా చెక్కతో తయారు చేసిన అచ్చుతో ముద్రవేస్తారు. ముద్రకు అనుగుణంగా సూదులతో పచ్చబొట్టు వేస్తారు. ఆకృతులను బట్టి ధర చెల్లించాల్సి ఉంటుంది. టాటూల్లో చాలా రకాలున్నాయి. యువతను ఆకర్షించేందుకు లవ్ సింబల్, హార్ట్ సింబల్, సీతాకోక చిలుక, నెమలి పించం, ఓంకారం, పుర్రే, డైనోసర్, కోడిపుంజు, సింహంతోపాటు వివిధ ఆకృతులు అందుబాటులో ఉన్నాయి. కొందరు అక్షరాల రూపంలో టాటూలు వేయించుకుంటున్నారు. షాపింగ్ మాల్స్ ముఖ్యకూడలిల వద్ద యువతను ఆకర్షించేందుకు టాటూ కౌంటర్లను ఏర్పాటుచేస్తున్నారు. మిషన్లతో నచ్చిన ఆకారాలు, ఆకృతులు, పేర్లను రాస్తున్నారు. ఇక ఫంక్షన్ల వద్దా టాటూ కౌంటర్లను పెడుతున్నారు.

సూదులతో జాగ్రత్త...

నాటు పద్ధతిలో శరీరంపై వేయించుకునే పచ్చబొట్టు విషయంలో జాగ్రత్తలు అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. సూదితో వేసే ముద్ర పొడిపించుకునే సందర్భంలో ఒకరికి ఉపయోగించిన సూదిని వేరొకరికి ఉపయోగించడం ప్రమాదకరం. కొత్త సూదులను మాత్రమే వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. - రావులపాలెం





చింతూరు-మారేడుమిల్లి మధ్య ఘాట్ రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు

ఘాట్ కష్టాలు గట్టెక్కినట్టే!

చింతూరు-మారేడుమిల్లి ఘాట్ రోడ్డు మరమ్మతులకు రూ.5.21 కోట్లు మంజూరు

చింతూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతా రామరాజు జిల్లా చింతూరు ఘాట్ రోడ్డు మరమ్మతులకు భారీ ఎత్తున నిధులు మంజూరయ్యాయి. చింతూరు- మారేడుమిల్లి మధ్యం దూరం 51 కి.మీ.గా ఇందులో ఘాట్ 28 కి.మీ. గత ఐదేళ్లలో ఈ రోడ్డు మెయింటెనెన్స్ పనులు ముట్టలేదు. దీంతో పలు ప్రదేశాల్లో గుంతలు పడ్డాయి. మరి కొన్ని ప్రదేశాల్లో రహదారి అంచులు వర్షం ధాటికి కొట్టుకపోయాయి. దీంతో అటువైపు ప్రయాణం అసౌకర్యంగా, ప్రమాదభరితంగా మారింది. ఈ రహదారి మీదుగా మన రాష్ట్రం నుంచి ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్రలకు రాకపోకలు అధికంగా ఉంటాయి. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న రహదారిని గత వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి రూ.4.21 కోట్లు నిధులు మంజూరు చేసింది. దీంతో పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఆర్అండ్‌బీ శాఖ సిద్ధమైంది. వేర్వేరుగా రెండు టెండర్లు పిలిచింది. మొదటిది చింతూరు-మారేడుమిల్లి మధ్య తాత్కాలిక మరమ్మతులకు రూ.46 లక్షలు కేటాయించింది. వీటికి టెండరు ప్రక్రియ ముగిసింది. త్వరలో పనులు మొదలు కానున్నాయి. రెండో టెండరులో ఘాట్‌లో 8 కి.మీ. మేర పనులు చేపట్టేందుకు రూ.3 కోట్లు కేటాయించింది. లక్కవరం నుంచి చింతూరు వరకు 4 కి.మీ. మరమ్మతులకు రూ.1.75 కోట్లు కేటాయించారు. ఈ రెండు పనులు టెండర్ దశలో ఉన్నాయి.




నాయకంపల్లి శివపంచాయతన క్షేత్రంలో భక్తులకు అనుగ్రహభాషణ చేస్తున్న విధు శేఖర భారతీ మహాస్వామి

నాయకంపల్లిలో సనాతన ధర్మ ప్రచారం

గండేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మంలో అన్ని ప్రశ్నలకు సరైన సమాధానం ఉండనే ఉందని శంకరాచార్యులు ఈ లోకానికి తెలియజేశారని శృంగేరీ పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి పేర్కొన్నారు. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం నాయకంపల్లిలో తత్వం చారిటబుల్ ట్రస్టు ద్వారా గ్రామస్తులు, భక్తుల సహకారంతో నిర్మించిన శివపంచాయతన క్షేత్రంలోని సువర్ణ భారతి గోశాల, సువర్ణ భారతి పాకశాల, సువర్ణ భారతి ప్రవచన మంటపములను గురువారం ఆయన ప్రారంభించి భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. ఇవాళ్టి రోజున ఇటువంటి ధార్మిక వాతావరణం, క్షేత్రం, సనాతన వైదిక ధర్మ పరంపరను చూస్తున్నామంటే దానికి కారణం నిస్సందేహంగా జగద్గురువులు ఆదిశంకరచార్యులేనన్నారు. తత్వం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస బంగారయ్య శర్మ మాట్లాడుతూ ఈ క్షేత్రం భవిష్యత్తులో దేదీప్యమానంగా వెలుగొందుతుందన్నారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. టీటీడీ పాలకమండలి సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి పీవీ జనార్దన్‌నాయుడు, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, చైతన్య విద్యా సంస్థల అధినేత చైతన్యరాజు, మలిరెడ్డి పాపారావు, ఎస్వీఎస్ అప్పలరాజు, జెట్టి గ్రానైట్ అధినేత శివకుమార్, జాస్తి వసంత్, పోతుల మోహనరావు, కుంచే రాజా, బూరుగుపల్లి వెంకటరావు, ఎస్ఆర్‌కే రామకృష్ణ, దాపర్తి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



స్వామికి ఆశీర్వచనం ఇస్తున్న వేద పండితులు

సత్యదేవుని మూలవర్లకు ప్రత్యేక పూజలు

అన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శృంగేరీ పీఠం ఉత్తరాధికారి విధు శేఖర భారతీ మహాస్వామి గురువారం రాత్రి సత్యదేవుని సన్నిధికి విచ్చేశారు. ఆయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావు, చైర్మన్ ఐవీ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. గర్భాలయంలో మూలవరులకు మహాస్వామి స్వయంగా ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం ఆయనకు పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం అందజేశారు. దీనిపై వచ్చే వడ్డీతో ప్రతిఏటా తన గురువు భారతీ తీర్థానంద పేరున చైత్ర శుద్ధ షష్ఠి రోజున అన్నదానం జరిపించాలని కోరారు.



స్వామీజీ ఆశీస్సులు తీసుకుంటున్న యనమల దంపతులు

కుమ్మరిలోవ తపోవనంలో

విధు శేఖర భారతీ మహాస్వామి

తుని రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాండవ కాశీగా పేర్గాంచిన కుమ్మరిలోవ తపోవనానికి శృంగేరీ పీఠం ఉత్తరాధికారి విధు శేఖర భారతీ మహాస్వామి విచ్చేశారు. ఆయనకు తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మహా స్వామికి సచ్చిదానంద సరస్వతి ధూళి పాదపూజ నిర్వహించారు. సహస్ర మోదక గణపతి హోమం నిర్వహించారు. శ్రీరుద్రయాగ పూర్ణాహుతిలో మహాస్వామి పాల్గొన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు దంపతులే. టీటీడీ పాలకమండలి సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, అన్నవరం దేవస్థానం ఈవో త్రినాథ రావు, లోవ దేవస్థానం ఈవో, ఉప కమిషనర్ పి.విశ్వనాథ రాజు, దేవదాయ శాఖ ఆర్జేసీ కొమ్ముల సుబ్బారావు స్వామి ఆశీస్సులు పొందారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులకు సచ్చిదానంద సరస్వతి స్వామి శిష్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తుని రూరల్ సీఐ చెన్న కేశవరావు ఆధ్వర్యంలో 16వ నెంబరు జాతీయ రహదారి నుంచి తపోవనం క్షేత్రం వరకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు.

సత్యదేవుని సన్నిధిలో దేవదాయ శాఖ కమిషనర్

అన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి గురువారం దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ విచ్చేశారు. స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఈవో త్రినాథరావు, చైర్మన్ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, ప్రొటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ వున్నారు.



దర్శనానంతరం కమిషనర్ సత్యనారాయణ



పసుపు వస్త్రాలతో రత్నగిరి చేరుకున్న పల్లం గ్రామస్తులు

పల్లం నుంచి రత్నగిరికి...

అన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం గ్రామం నుంచి సుమారు 500 మంది భక్తులు సత్యదేవునికి ప్రీతిపాత్రమైన పసుపు రంగు వస్త్రాలతో రత్నగిరికి చేరుకున్నారు. ఈనెల 25న పల్లంలో బయల్దేరామని, హిందూ ధర్మ భాగంగా ప్రతిఏటా ఈ విధంగా పాదయాత్రగా వస్తున్నామన్నారు. పల్లం గ్రామస్తులకు అన్నవరం దేవస్థానం ప్రొటోకాల్ సూపరెంటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ అల్పాహారం, వసతి ఏర్పాట్లు చేశారు.



ఊరేగింపుగా సారె తీసుకొస్తున్న మహిళలు

సాంబశివునికి సారె సమర్పణ

ఏలేశ్వరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ఏలేశ్వరం పట్టణంలో వేంచేసియున్న గౌరీ సాంబశివుని ఆలయానికి నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్ అలమండ చలమయ్య దంపతులు సారె సమర్పించారు. గురువారం వారి నేతృత్వంలో పసుపు, కుంకుమ, పండ్లు, స్వీట్లు, పువ్వులు, చీర, రవిక, గాజులు సమర్పించారు. కార్యక్రమంలో అలమండ దుర్గావెంకట ప్రసాద్, తూరౌతు గురవయ్య, కటకం కిరీటి, బెల్లాని శ్రీను, ఉడతల రామణారావు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- వచ్చేనెల 5న ఎన్నికలు
- 9న ఫలితాలు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. వచ్చే నెల 2న కాకినాడ కలెక్టరేట్‌లో ఎన్నికల సూక్ష్మ పరిశీలకులు, ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. డిసెంబరు 5న ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. 9న ఎన్నికల ఫలితాలు విడుదలవుతాయి. ఇప్పటికే ఎన్నికల బ్యాలెట్ పత్రాలు రాగా ట్రెజరీ కార్యాలయంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చారు. ఆరుజిల్లాల పరిధిలో 16737 మంది ఓటర్లు ఉండగా 19150 బ్యాలెట్ పత్రాలు సిద్ధంచేశారు. దీనికోసం 230 బాక్సులు సిద్ధం చేశారు.ఆరుజిల్లాల్లో 116 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికలకోసం 141మంది పీవోలు, 141మంది ఏపీవోలు,279మంది ఓపీవోలు, 141మంది సూక్ష్మపరిశీలకులను నియమించారు. ఆరు జిల్లాలకు 54, రూట్లు 32 జోన్లుగా విభజించారు. దీనికి రూట్, జోనల్ ఆఫీసర్లు, 88మందిని నియమించారు.ఎన్నికలబరిలో ఐదుగురు అభ్యర్థులు తలపడుతున్నారు.

నేడు పీజీ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

దివాన్‌చెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎంఏ, ఎంకామ్, ఎంపీఈడీ, ఎమ్మెస్సీ కోర్సుల్లోని భర్తీ చేయని సీట్లకు ఈనెల 29న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఏపీపీజీసెట్ రాయకపోయినా, రాసి అర్హత సాధించకపోయినా స్పాట్ అడ్మిషన్‌లో పీజీ కోర్సులో ప్రవేశం పొందవచ్చునన్నారు. డిగ్రీలోఉత్తీర్ణతా శాతం ఓసీ, బీసీ 50శాతం, ఎస్సీ, ఎస్టీలకు 45శాతం సాధించినవారు పీజీ ప్రవేశాలకు అర్హులన్నారు. ఉదయం 11గంటల్లోపు సంబంధిత విశ్వవిద్యాలయంకళాశాల కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కౌన్సిలింగ్ ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డి.జ్యోతిర్మయి పర్యవేక్షిస్తారని చెప్పారు.

తీరం అల్లకల్లోలం



ఉప్పాడలో అలల ఉధృతికి కొట్టుకుపోయిన మత్స్యకారుల ఇళ్లు

- 'ఫెంగల్' తుఫాన్ ప్రభావంతో తీరంలో ఈదురుగాలులు
- అలల ధాటికి మత్స్యకారుల ఇళ్లపైకి వచ్చి పడుతున్న సముద్రనీరు



ఉప్పాడలో అల్లకల్లోలంగా మారిన సముద్రం

కొత్తపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన 'ఫెంగల్' తుఫాన్ ప్రభావంతో సముద్రతీరంలో అలలు ఉధృతంగా ఎగసిపడుతున్నాయి. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడలో తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. సముద్రం మధ్యలో కెరటాలు సుడులు తిరుగుతూ తారాస్థాయికి ఎగిరిపడుతున్నాయి. దీంతో మత్స్యకారులు సముద్రంలో లంగర్ వేసిన తమ బోట్లను రామన్నపాలెం ఉప్పుటేరు వద్దకు తరలించి భద్రపరుచుకున్నారు. తీరప్రాంతంలో సముద్రం ఉదయం నుంచీ అల్లకల్లోలంగా ఉండడం, ఉవ్వెత్తున ఎగసిపడే రాకాసి అలలు ఒడ్డున మకాం ఉంటున్న మత్స్యకారుల ఇళ్లలోకి దూసుకొస్తున్నాయి. దీంతో మత్స్యకారుల కుటుంబాలకు చెందిన పిల్లలు, పెద్దలు అంతా సురక్షిత ప్రాంతాలకు వెళ్లి తలదాచుకుంటున్నారు. ఇటీవలకాలంలో తరచూ ఏర్పడుతున్న తుఫాన్, అల్పపీడనాలతో వేట లేకపోవడంతో జీవనోపాధికి తీవ్ర ఆటంకం కలుగుతోందని, దీంతో కుటుంబాలను అప్పులు చేసి పోషించుకోవాల్సిన అగత్యం ఏర్పడిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేట విరామ సమయంలో ప్రభుత్వం చెల్లించాల్సిన పరిహారం చెల్లించి ఆదుకోవాలని తీరప్రాంత మత్స్యకారులు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం



రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న డీఈవో రమేష్.. క్రీడాకారుల ర్యాలీ

కాకినాడ అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. కాకినాడ డీఎస్ఏ మైదానంలో ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో రమేష్ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలు విద్యార్థులకు మానసికోల్లాసం అందిస్తాయన్నారు. డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. అండర్-17 బాలికల విభాగంలో మూడు రోజులపాటు జరిగే పోటీల్లో వివిధ జిల్లాలనుంచి అధికారులతో సహా 200మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. కార్యక్రమంలో టోర్నమెంట్ పరిశీలకుడు కె.ఈశ్వరరావు, సానా సతీష్ ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్, అండర్-19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శివరామకృష్ణ, గీతం స్కూల్స్ అధినేత సుజ్జాన్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఏఎన్ రామ్‌ప్రసాద్, ఛైర్మన్ కేవీబీ మోహనరావు, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, కార్యదర్శి నూకరాజు, కోశాధికారి కొర్.ఎస్‌జీ టీ సహాయ కార్యదర్శి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

మొదటిరోజు విజేతలే వీరే

కృష్ణా జిల్లాపై కర్నూలు జట్టు 13.9 స్కోతో గెలుపు, ప్రకాశంపై శ్రీకాకుళం 13.3, విశాఖపై తూర్పుగోదావరి 9.5, పశ్చిమగోదావరిపై నెల్లూరు 12.0, చిత్తూరుపై అనంతపురం 11.2, కృష్ణాపై శ్రీకాకుళం 13.1, కర్నూలుపై ప్రకాశం 22.10, విశాఖపై గుంటూరు9.1, నెల్లూరుపై కడప 10.0, చిత్తూరుపై విజయనగరం 10.0, పశ్చిమపై కడప 5.0 స్కోరుతో గెలుపొందాయి.

నేటినుంచి అంతర జిల్లాల బాలికల బాల్ బాడ్మింటన్ పోటీలు



బాలికలకు అందించిన కిట్లతో హెచ్ఎం, పీడీలు

బిక్కవోలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు జడ్పీ హైస్కూల్ ప్లస్ పాఠశాలలో ఈనెల 29,30 తేదీల్లో అంతర జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్టు హెచ్ఎం పి.వీరప్రభాకరరావు గురువారం తెలిపారు. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి బాలికలు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. తూర్పుగోదావరి జిల్లా జట్టుకు ఆయన కిట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పీడీలు ధనరాజు, యువరాజారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి, అప్పారెడ్డి, ప్రభాకరరెడ్డి, ఉపాధ్యాయులుశ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయస్థాయిలోను సత్తా చాటాలి

- రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ పోటీలు ప్రారంభించిన కోనసీమ కలెక్టర్



అనంతపురం జట్టుతో కోనసీమ కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): క్రీడాస్ఫూర్తిని చాటుతూ క్రీడాకారులు రాష్ట్ర కీర్తి ప్రతిష్ఠలను జాతీయస్థాయిలోను ఇనుమడింప చేసేలా రాణించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గురువారం రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ క్రీడా పోటీలను కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభించా రు. క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం బ్యాటింగ్ చేసి పండుగ వాతావరణంలో క్రీడా పోటీలను ప్రారంభించారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో క్రీడాకారులు తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని పిలుపునిచ్చారు. తొలుత వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రికెట్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తొలిరోజు వివిధ జిల్లాల జట్ల మధ్య పోటీలు రసవత్తరంగా జరిగాయి. ప్రారంభోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ కుడుపూడిసూర్యనారాయణరావు, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్, పాఠశాల హెచ్ఎం ఎస్.రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. తొలుత విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు క్రీడాభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను ఆర్గనైజింగ్ కార్యదర్శులు తోట రవి, గోవిందరావు, పి.విష్ణుప్రసాద్, ఫణీంద్రకుమార్,యూవీ ముసలయ్య, కిశోర్, మధుసూదనరావు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు చొల్లంగి ప్రసాద్, కార్యదర్శి బీవీవీఎస్ఎన్ మూర్తి, జోన్ అధ్యక్షుడు వైఎస్వీ రమణారావు, ఎంఈవో రేలంగి నాగకుమార్, విత్తనాల శ్రీనివాస్‌లు పర్యవేక్షించారు.

మద్యం మత్తులో కొట్లాట

- ఒకరికి తీవ్రగాయాలు, ముగ్గురికి గాయాలు
- డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంలో ఘటన

కాట్రేనికోన, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంలో గురువారం సాయంత్రం మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో ఒకరు తీవ్రంగా గాయపడగా, ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. ఎస్ఐ అవినాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పల్లం గ్రామంలో టీడీపీకి చెందిన దోమ మణికంఠ, బొమ్మిడి ప్రసాద్, మల్లాడి కొండయ్య, వైసీపీకి చెందిన కాటం శ్రీను మధ్య మద్యం మత్తులో వివాదం తలెత్తింది. దీంతో పరస్పరం పిడిగుద్దులు గుద్దుకున్నారు. తనను మణికంఠ, ప్రసాద్, కొండయ్య గాయపరిచారంటూ వైసీపీకి చెందిన కాటం శ్రీను పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం ముమ్మిడివరం ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లిపోయాడు. మల్లాడి కొండయ్యకు తలపై తీవ్రగాయం కావడంతో బొమ్మిడి ప్రసాద్ తన వాహనంపై ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయం తీవ్రంగా ఉండడంతో అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐను వివవరణ కోరగా ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారన్నారు. అయితే మల్లాడి కొండయ్యకు తలపై గాయానికి కారణమేంటో విచారణ నిర్వహిస్తామన్నారు. రెండు ఫిర్యాదులపై కేసులు నమోదు చేశామన్నారు.



గాయపడిన మల్లాడి కొండయ్య

శబరిమలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

- సామర్లకోట మీదుగా 44 స్పెషల్ రైళ్ల రాకపోకలు
- వారంలో రెండురోజులు.. మూడు నెలలపాటు ఉండేలా ప్రణాళిక
- అయ్యప్ప దీక్షాధారులకు రైల్వే ప్రయాణ సదుపాయం



సామర్లకోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలుగురాష్ట్రాలనుంచి అయ్యప్ప దర్శనంకోసం శబరిమల వెళ్తున్న భక్తులకు రైల్వే శుభవార్త అందించింది. విశాఖపట్నం, శ్రీకాకుళం రోడ్డు, హైదరాబాద్, కాచిగూడ నుంచి కొల్లాం, కొట్టాయంలకు పెద్దసంఖ్యలో ప్రత్యేక రైళ్ల సర్వీసులను ఏర్పాటు చేసింది. అందులో సామర్లకోట మీదుగా విశాఖ, శ్రీకాకుళం రోడ్ నుంచి రానుపోను ఏర్పాటు చేసిన 44 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్ల వివరాలను రైల్వే పీఆర్వో కార్యాలయం ప్రకటించింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే శబరిమల అయ్యప్ప దర్శనార్థం దీక్షాధారణలో వెళ్లే అయ్యప్పస్వామి భక్తుల ప్రయాణ సౌకర్యార్థం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను సామర్లకోట మీదుగా అటు విశాఖ నుంచి, శ్రీకాకుళం రోడ్‌ల నుంచి ఈ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే ఉన్నతాధికారుల ద్వారా తెలిసింది. ఈ మేరకు సామర్లకోట ఆంధ్రజ్యోతి ప్రత్యేక రైళ్ల సమాచారాన్ని సేకరించింది.

- 08539 నెంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ విశాఖ-కొల్లాం మధ్య ప్రతి బుధవారం విశాఖ నుంచి రాత్రి 8.20 గంటలకు బయలుదేరనుంది. ఈ రైలు గురువారం అర్ధరాత్రి 12.55 గంటలకు కొల్లాం చేరుకోనుంది. డిసెంబరు 4 నుంచి 2025, ఫిబ్రవరి 26 వరకూ ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ డిసెంబరు 4, 11, 18, 25, జనవరి 1, 8, 15, 22, 29, ఫిబ్రవరి 5, 12, 19, 26తేదీల్లో 13 ట్రిప్పులుగా ప్రతి బుధవారం నడవనుంది.
- 08540 నంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ కొల్లాం-విశాఖ మధ్య ప్రతి గురువారం కొల్లాం నుంచి రాత్రి 7.35 గంటలకు బయలుదేరనుంది. ఈ రైలు శుక్రవారం రాత్రి 11.20 గంటలకు విశాఖకు చేరుకోనుంది. డిసెంబరు 5 నుంచి 2025, ఫిబ్రవరి 27 వరకూ నడవనున్న ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ డిసెంబరు 5, 12, 19, 26, జనవరి 2, 9, 16, 23, 30, ఫిబ్రవరి 6, 13, 20, 27తేదీల్లో 13ట్రిప్పులుగా ప్రతి గురువారం నడువనుంది.

ఈ రైళ్లు దువ్వాడ మీదుగా సామర్లకోటకు 11.19 గంటలకు, రాజమండ్రికి 12.21 గంటలకు చేరుకుంటుంది. ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలారిపెట్టయ్, సేలం, ఈరోడ్, తిరుప్పూరు, పొడనూర్, పాలక్కాడ్, త్రిస్సూర్, అలువా, ఎర్నాకుళం, చంగనసెరి, తిరువళ్ల, చెంగనూర్, మావెలియకరి, కాయంకులంల మీదుగా కొల్లాం జంక్షన్‌కు రెండు రోజులు అనంతరం చేరుకోనుంది. మొత్తం 1,562 కిలోమీటర్ల దూరంలో 28 స్టేషన్లలో ఆగనుంది.

- 08553 నంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ శ్రీకాకుళంరోడ్-కొల్లాం మధ్య ప్రతి ఆదివారం బయలుదేరనుంది. ఈ రైలు ఆదివారం ఉదయం 6 గంటలకు బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుకోనుంది. ఈ రైలు డిసెంబరు 1, 8, 15, 22, 29, జనవరి 5, 12, 19, 26 తేదీల్లో 9ట్రిప్పులుగా ప్రతిఆదివారం నడుస్తుంది.
- 08554 నంబరు గల ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ కొల్లాం-శ్రీకాకుళం రోడ్ మధ్య ప్రతి సోమవారం బయలుదేరనుంది. ఈ రైలు ప్రతి సోమవారం 4.30 గంటలకు బయలుదేరి బుధవారం 2.30 గంటలకు చేరుకోనుంది. ఈ రైలు డిసెంబరు 2, 9, 16, 23, 30, జనవరి 6, 13, 20, 27వతేదీల్లో 9 ట్రిప్పులుగా నడవనుంది.

ఈ రైళ్లు శ్రీకాకుళం రోడ్, పొందూరు, చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, సింహచలం, దువ్వాడ, అనకాపల్లి మీదుగా సామర్లకోటకు ఉదయం 10.18గంటలకు చేరుకుని రాజమండ్రికి 11.03గంటలకు చేరుతుంది. ఏలూరు, విజయవాడ, ఒంగోలు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పెట్టయ్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొడనూరు, పాలక్కాడ్, త్రిస్సూర్, అలువా, ఎర్నాకుళం, ఎట్టుమన్నార్, కొట్టాయం, చంగనసెరి, తిరువళ్ల, చంగనూర్, మావెలియాకర్, కాయంకుళం మీదుగా కొల్లాంకు మధ్యాహ్నం 2.30 గంటలకు రెండు రోజుల అనంతరం చేరుకోనుంది. మొత్తం 1,691 కిలోమీటర్ల దూరంలో 34 స్టేషన్లలో ఆగనుంది. ఈరైళ్లల్లో ప్రయాణించే అయ్యప్ప భక్తులు తమ సమీప రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయంలో రిజర్వేషన్ టిక్కట్లు పొందవచ్చని ప్రకటించారు.

గుర్తుతెలియని కారు ఢీకొని గాయాలు

కరప, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని కారు ఢీకొని ఒక మత్స్యకారుడు తీవ్రంగా గాయపడ్డాడు. కరప పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం భైరవపాలెం గ్రామానికి చెందిన రేకాడి కరుణకుమార్ మత్స్యకారుడు. ఈనెల 24న పనిమీద కాకినాడ వచ్చి తిరిగి వెళ్తుండగా కరప మండలం చొల్లంగి బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో గాయపడిన కరుణకుమార్ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతూ కోలుకున్నాడు. బాధితుడు గురువారం కరప పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ తోట సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

వెంకన్న ఆలయంలో టీటీడీ చైర్మన్ నాయుడు పూజలు



టీటీడీ చైర్మన్ నాయుడుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. గురువారం సాయంత్రం ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చక బృందం ఘనస్వాగతం పలికింది. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి ప్రదక్షిణలు నిర్వహించుకుని కుటుంబ సభ్యులతో ఆయన స్వామిని దర్శించుకున్నారు. వసంత మండపంలో పండితులు వేదాశీర్వచనం అందచేశారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు టీటీడీ చైర్మన్ నాయుడు దంపతులకు నూతన వస్త్రాలను అందచేశారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి చిత్రపటం అందచేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. తొలుతగా చైర్మన్ నాయుడుని ఎమ్మెల్యే బండారు ఆధ్వర్యంలో పార్టీ ముఖ్యనేతలు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి, ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, కాయల జగన్నాథం, ముత్యాల బాబ్జి, తదితర నేతలు ఆయనకు స్వాగతం పలికారు.

5న కాకినాడలో 'వేగ జ్యూయలర్స్' ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న వేగ జూయలర్స్ అధినేతలు

కాకినాడ సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 5న కాకినాడలో వేగ జ్యూయలర్స్ 4వ షోరూమ్‌ను ప్రారంభిస్తున్నట్లు సంస్థ అధినేతలు వనమా నవీన్, వనమా సుధాకర్ తెలిపారు. గురువారం హోటల్ రాయల్ పార్క్‌లో వారు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ 5వతేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు కాకినాడ బాలాజీచెరువు దగ్గరలో వేగ షో రూమ్‌ను సినీ నటుడు నందమూరి బాలకృష్ణ, సినీనటి సంయుక్త మీనన్ ప్రారంభిస్తారన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా డిసెంబర్ 5 నుంచి 12 వరకు బీఐఎస్ హాల్మార్క్ బంగారు ఆభరణాలు, సర్టిఫికెట్స్‌తో డైమండ్స్ ప్రత్యేక రాయితీ, ఆఫర్లతో అందించనున్నామన్నారు. ఈ ప్రత్యేక ఆఫర్లను కాకినాడ, పరిసర ప్రాంత ప్రజలందరూ వినియోగించుకోవాలని, రాబోయే క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి పండుగలను మరింత ఆనందంగా జరుపుకోవాలన్నారు. వివాహ ముహూర్తాలు, వివాహ వేడుకల కోసం సంప్రదాయ ఆభరణాలనుంచి ఆధునిక ఫ్యాషన్ ఆభరణాల వరకు అన్ని వర్గాలకు అందుబాటులో ఉంచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఎన్నో ఏళ్లుగా విజయవాడ, హైదరాబాద్‌లో ప్రజలకు నాణ్యమైన బంగారు ఆభరణాలు అందించి ఖాతాదారుల విశ్వాసం పొందామన్నారు. కాకినాడలో షోరూమ్ ప్రారంభం తర్వాత రాజమహేంద్రవరంలో ప్రారంభిస్తామన్నారు. కాకినాడ ప్రజలు తమ కొత్త షోరూమ్ ప్రారంభోత్సవానికి విచ్చేసి ప్రోత్సహించాలన్నారు. సంస్థకు సంబంధించి సినీనటుడు బాలకృష్ణ ప్రచారకర్తగా నటించిన యాడ్‌ఫిల్మ్‌ను విడుదల చేశారు.

మృతుల కుటుంబాలకు రూ.40లక్షల ఎక్స్‌గ్రేషియా

- మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పరవాడ ఫార్మా పరిధిలో ఠాగూర్ ల్యాబ్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మృతులు ఒక్కో కుటుంబానికి రూ.40లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని కార్మిక, పరిశ్రమల శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటించారు. ఈనెల 26న సాయంత్రం 4.40 గంటలకు ఠాగూర్ ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రియాక్టర్ జీఎల్ 325వద్ద హెచ్‌సీఎల్ క్లోరోఫామ్ లీకేజీ ప్రమాదంలో కార్మికులు అస్వస్థతకు గురయ్యారన్నారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ అదేరోజున ఒకరు మృతి చెందగా గురువారం మరొకరు మృతి చెందడం బాధాకరమన్నారు. ఐసీయూలో ఉన్న మరోకార్మికుడు పరిస్థితి ఆందోళకరంగా ఉందన్నారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.40లక్షల చొప్పున చెల్లించేందుకు సంస్థ యాజమాన్యంతో ఒప్పందం కుదిరిందన్నారు. లీకేజీ ఘటనపై విచారణ జరిపించి నిర్లక్ష్యం వహించిన సంస్థపై చర్యలు తీసుకున్నామని మంత్రి సుభాష్ అన్నారు.

గంజాయి కేసుల్లో నిందితుల అరెస్టు

మోతుగూడెం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు గంజాయి కేసుల్లో ఐదుగురు నిందితులు, ఒక మైనర్‌ని అరెస్టు చేసి 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో బైక్ దొంగతనాలు చేసి వ్యసనాలకు అలవాటు పడి గంజాయి రవాణా చేస్తున్న ముఠా గుట్టురట్టు చేసిన డొంకరాయి పోలీసులు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఐపీఎస్, చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా, చింతూరు సీఐ టి.దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు డొంకరాయి ఎస్ఐ శివకుమార్‌కి వచ్చిన సమాచారంతో గురువారం 23 కిలోల గంజాయి రవాణా చేస్తున్న విజయవాడ ప్రాంతానికి చెందిన ఇందుకూరి త్రినాద్, డికొండ రాజేష్, రెళ్ల సాయికిరణ్, ఓమైనర్‌ను పట్టుకున్నారు. వారిలో ముగ్గురిని రిమాండ్‌కి తరలించారు. మైనర్‌ను జువనైల్ హోమ్‌కి తరలించినట్లు తెలిపారు. ఈ నలుగురు విజయవాడ, మంగళగిరి చుట్టుపక్కల ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తారని, వాటిని ఇతర ప్రాంతాలకు తరలించి అమ్మి వచ్చిన సొమ్ముతో గంజాయిని కొనుగోలు చేస్తున్నారని పోలీసులు తెలిపారు. దొంగిలించిన మూడు ద్విచక్రవాహనాలను గుంటూరు శివారు ప్రాంతంలో ఉంచగా వాటిని పోలీసులు రికవరీ చేశారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా హోండా లియో బైక్‌పై రెండు కిలోల గంజాయి అక్రమ రవాణా చేస్తున్న జంగారెడ్డిగూడేనికి చెందిన వీపు వెంకటేష్, మరిగల మణికంఠలను అరెస్టు చేశారు. ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడి వచ్చిన సొమ్ముతో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన డొంకరాయి రైటర్ శ్రీనివాస్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ కళ్యాణ్, కానిస్టేబుల్ పోశయ్యను ఏఎస్పీ అభినందించారు.

ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో..

ప్రత్యేక రైళ్ల కాలపరిమితి పెంపు

సామర్లకోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మీదుగా కాకినాడ నుంచి లింగంపల్లి మధ్య నడిచే 07445నెంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును వచ్చేనెల 6 నుంచి 30 వరకూ పొడిగిస్తూ రైల్వే పీఆర్వో ఎ.శ్రీధర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు సామర్లకోట రైల్వేస్టేషన్‌కు గురువారం అందాయి. ఈ రైలు ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో కాకినాడ టౌన్ స్టేషన్‌నుంచి లింగంపల్లికి బయలుదేరుతుంది. లింగంపల్లి-కాకినాడటౌన్ మధ్య నడిచే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ వచ్చేనెల 7 నుంచి 31వరకూ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ రైలు ప్రతి మంగళ, గురు, శనివారాల్లో లింగంపల్లిలో బయలుదేరి కాకినాడ టౌన్‌కు చేరుతుంది. ఈ రెండు రైళ్లూ రాజమండ్రి, తణుకు, భీమవరం, ఆకివీడు, కైకలూరు, గుడివాడ మీదుగా విజయవాడకు చేరనున్నాయి. రైల్వేస్టేషన్‌ల్లో రిజర్వేషన్ టిక్కెట్లు పొందవచ్చని పీఆర్వో శ్రీధర్ తెలిపారు.

ఘనంగా లక్షబిల్వార్చన పూజ

కరప, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వాకాడ శివాలయంలో గురువారం లక్షబిల్వార్చన పూజ ఘనంగా జరిగింది. ఎస్ఆర్ఐ పులి రాంబాబు దంపతుల ఆధ్వర్యంలో వేదపండితుడు కప్పగంతు సాయి సమక్షంలో 11మంది రుత్వికులు అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అన్నసంతర్పణకు భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పూర్వ విద్యార్థుల వితరణ

కాకినాడ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ లయన్స్‌క్లబ్ హాల్లో రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంపిక చేసిన 110మంది పేదలకు దుస్తులు, కళ్లజోళ్లను పూర్వవిద్యార్థి జగన్నాథరావు అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ బాదంబాలకృష్ణ, రామ్‌చరణ్,రమణమూర్తి పాల్గొన్నారు.

కట్టమూరులో లక్షబిల్వార్చన

పెద్దాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టమూరులోని రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం వైభవంగా లక్ష బిల్వార్చన నిర్వహించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఈ లక్ష బిల్వార్చన చేపట్టినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రామ్మూర్తి నాయుడికి నివాళి

సామర్లకోట, నవంబరు 28(ఆంధ్ర జ్యోతి): సీఎం చంద్రబాబునాయుడి సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతి పట్ల సామర్లకోట పట్టణ టీడీపీ నాయకులు తీవ్రసంతాపం తెలిపారు. సామర్లకోటలో రామ్మూర్తినాయుడి చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. టీడీపీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అక్షు'లో స్పాట్ అడ్మిషన్స్

సర్పవరం జంక్షన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ తిమ్మాపురం అక్షు ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో ఏపీ ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు శుక్రవారం పీజీ కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.కమలాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో ఉత్తీర్ణత సాధించి పీజీ సెట్ రాయని విద్యార్థులు ఎవరైతే ప్రవేశం కోసం వేచిచూస్తున్నారో వారి కోసం స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ ద్వారా అడ్మిషన్ ఇస్తారన్నారు. ఎంఏ ఇంగ్లీష్, ఎంఏ ఎకనామిక్స్ ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంకామ్, ఎమ్మెస్సీ మ్యాథమేటిక్స్‌లో చేరే విద్యార్థులకు ఈనెల 29న శుక్రవారం అచ్చంపేట సెంటర్‌లోని అక్షుఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌కు వచ్చి ఆయా పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందాలన్నారు.వివరాలకు 97018 27564 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం

కార్పొరేషన్(కాకినాడ),నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయ సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలకు సంబంధించి ప్రతినెలా ఏర్పాటు చేసే మెప్మా అర్బన్ మార్కెట్‌ను కాకినాడలో గురువారం ప్రారంభించారు. కాకినాడ నగరంలోని రిజర్వు పోలీస్ లైన్ సమీపంలో ఉన్న ఓల్డ్ మీసేవా కేంద్రంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను టీపీఆర్వో కెశైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకట్రాజు పరిశీలించారు. మెప్మా సీవోలు, సెల్లర్ పాయింట్ డీఆర్పీ అమృత కల్యాణి, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీవో కార్యవర్గం



కరప యూనిట్‌లోని కార్యవర్గం

కరప, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీవో కరప యూనిట్‌లో ఖాళీలను కో-ఆప్షన్ ప్రక్రియలో ఎన్నుకున్నట్లు సంఘాధ్యక్షుడు బీఆర్‌వీకే చౌదరి తెలిపారు. కాకినాడ ఏపీఎన్‌జీవో హోంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహన్‌రావు, కార్యదర్శి పి.కృష్ణ, పరిశీలకులుగా చంద్రరావు, వెంకటేశ్వరరావు, మూర్తిబాబు హాజరైనట్టు గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ కరప యూనిట్ సహాధ్యక్షురాలిగా బి.సుజాత, కార్యదర్శిగా కె.కేశవరావు, ఉపాధ్యక్షులుగా వీవీఎస్ వీరేశ్, ఎస్.నాగఫణిబాబు, వి.వినోద్, జాయింట్ సెక్రటరీలుగా కె.నానిబాబు, ఎస్.ఫణిమురళీకృష్ణ, ఎం.దుర్గాప్రసాద్ ఎన్నుకున్నట్టు వివరించారు. కార్యవర్గ సభ్యులను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

పాఠశాలల అభివృద్ధికి యాక్షన్ ప్లాన్

- రేపు హెచ్ఎంలకు వర్క్‌షాపు
- పిఠాపురంలో నిర్వహణ
- పాఠశాలల వారీగా ప్రణాళిక
- డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలు

పిఠాపురం,నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తిస్థాయి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై అధికార యంత్రాంగం దృష్టిసారించింది. ఈ మేరకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని పాఠశాలలను అభివృద్ధి చేసే విధంగా యాక్షన్ ప్లాన్ రూపొందించనున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 30వ తేదీన పిఠాపురం పట్టణం రథాలపేట అంబేడ్కర్ భవన్‌లో నియోజకవర్గంలోని అన్ని ఉన్నత పాఠశాలల హెచ్ఎంలకు ఒకరోజు వర్క్‌షాపు నిర్వహించనున్నారు. ఉన్నత పాఠశాలల్లో సౌకర్యాల కల్పనపై దృష్టిపెట్టిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న అన్ని ప్రభుత్వ, జిల్లాపరిషత్, మునిసిపల్ ఉన్నత పాఠశాలలకు రెండు వంతున క్రీడాపరికరాలు కిట్లు అందజేశారు. విద్యార్థులకు ప్రయోగాలపై ఆసక్తి పెంపొందించేందుకు సైన్స్ ల్యాబ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే గొల్లప్రోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌ను పవన్ స్వయంగా ప్రారంభించారు. పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఇప్పుడు అన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో సదుపాయాలు, సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఇందుకు ప్రస్తుతం అమలులో ఉన్న ప్రభుత్వ పథకాలు సర్వశిక్షాభియాన్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జేజేఎం, సోషల్ ఫారెస్ట్రీ, పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనా(రూఫ్ టాప్ సోలార్ ప్యానల్స్), పీఎం శ్రీ, అటల్ ఇన్నోవేషన్ మిషన్ తదితరాలను వినియోగించుకుని పాఠశాలలకు అవసరమైన సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ పథకాల ద్వారా పాఠశాలలకు అవసరమైన అదనపు తరగతి గదుల నిర్మాణం, క్రీడామైదానాల



అభివృద్ధి, కాంపౌండ్‌వాల్స్ నిర్మాణం, విద్యార్థులకు బోధనలో వినియోగించే అన్ని రకాల పరికరాలు సమకూర్చుకోవడం, సౌర విద్యుత్ వినియోగం ద్వారా పాఠశాలలకు పూర్తిస్థాయిలో కరెంటు సౌకర్యం కల్పించడం తదితర అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో ఓఎస్‌డీ కె.వెంకటకృష్ణ ఈ మేరకు జిల్లా కలెక్టరుకు లేఖ రాశారు. డీఈవో, ఎస్ఎస్ఏ ఏపీవో, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఏఈఈలు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఏపీవోలు, అన్ని పాఠశాలల హెచ్ఎంలతో పాటు ఆయా పథకాలకు సంబంధించిన అధికారులు ఇందులో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరుకు సూచించారు. ఈ ఒక రోజు వర్క్‌షాపులో గుర్తించిన అంశాల ఆధారం గా పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో ఉన్న ఉన్నత పాఠశాలల అభివృద్ధికి యాక్షన్‌ప్లాన్ రూపొందించి చర్యలు చేపట్టనున్నారు.

లారీ యజమానులకు అండగా కూటమి ప్రభుత్వం

సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు కొండబాబు, నానాజీ

కాకినాడ సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): లారీ యజమానులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి ఎటువంటి సమస్య వచ్చినా అందుబాటులో ఉంటామని సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సంజయ్‌నగర్‌లోని అసోసియేషన్ ఆవరణలో కార్తీకమాస వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యేలు కొండబాబు, నానాజీలను గజమాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ 1962లో ఆవిర్భవించిన లారీ ఓనర్స్ అసోసియేషన్ 62 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. రాష్ట్రంలోనే ఈ అసోసియేషన్‌కు ఒక గుర్తింపు ఉందన్నారు. చిన్నపాటి లోటుపాట్లను సర్దుబాటు చేస్తాంగాని అసోసియే షన్‌ను చీలిపోనీయమన్నారు. మూడుపార్టీల కలయికతో కూటమి ప్రభుత్వం కలసి పయని స్తున్నట్లుగానే అసోసియేషన్‌లో అందరూ కలిసి ముందుకు సాగాలన్నారు. తొలుత జ్యోతీరావ్ పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టీడీపీ నగరఅధ్యక్షుడు, మల్లిపూడి వీరు, జనసేన నాయకుడు సంగిశెట్టి అశోక్, బీజేపీ నాయకురాలు సాలగ్రామ లక్ష్మీప్రసన్న, గౌడ, శెట్టిబలిజ కార్పొరేషన్ల డైరెక్టర్లు మట్టా ప్రకాష్ గౌడ్, వొమ్మి బాలాజీ, కూటమి పార్టీల నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, కటకంశెట్టి బాబీ, గదుల సాయిబాబు, తుమ్మల రమేష్, రాజాన సూర్యప్రకాష్, మాకిరెడ్డి భాస్కర్ గణేష్‌బాబు, కొక్కిలిగడ్డ గం గాధర్, అసోసియే షన్ కార్యదర్శి అల్లంరాజు, కోశాధికారి గణేశుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు అడిగర్ల గంగబాబు, కుర్చర్లపాటి అర్జున్‌రాజు, చిట్టిమేను సత్యనారాయణ, అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



కొండబాబు, నానాజీలను గజమాలతో సత్కరిస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఇంద్రపాలెంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

కాకినాడ రూరల్,నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం ఇంద్రపాలెంలో టీడీపీ సీనియర్ నాయకులు కొప్పిశెట్టి నాగబాబు ఆధ్వర్యంలో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని సభ్యత్వ నమోదును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ కుటుంబంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే పార్టీ టీడీపీ అని రెండేళ్ల సభ్యత్వానికిరూ.100 చెల్లించాలని, ప్రమాదబీమా రూ.2లక్షల ఇన్సూరెన్స్ లభిస్తుందన్నారు. అధిక సంఖ్యలో స్థానికులు టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రకాశరావు, ప్రసాద్, మోహన్ పాల్గొన్నారు.



టీడీపీ సభ్యత్వ నమోదును పరిశీలిస్తున్న డాక్టర్ చప్పిడి

'పార్టీ కోసం పనిచేసిన నాయకులకు సముచిత స్థానం'

సర్పవరం జంక్షన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ విజయం కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు సీఎం చంద్రబాబు సముచిత స్థానం కల్పిస్తారని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ వాసిరెడ్డి ఏసుదాసు అన్నారు. గురువారం రమణయ్యపేట టీడీపీ పార్టీ కార్యాలయంలో ఏసుదాసు ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్, గౌడకార్పొరేషన్, మాల కార్పొరేషన్ డైరెక్టర్లు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మట్టా ప్రకాశ్‌గౌడ్, కొల్లాబత్తుల అప్పారావులను దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశీస్సులతో అత్యధిక మెజార్టీతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శెట్టి బాబూరావు, జంక్షన్ బాబ్జి, కోనాల కృష్ణ, యజ్జల బాబ్జి, చీకోటి అప్పలరాజు, బి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ డైరెక్టర్లు డాక్టర్ వెంకటేశ్వరరావు, ప్రకాశీగౌడ్, అప్పారావులను సత్కరిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏసుదాసు

'పూలే గొప్ప దార్శనీకుడు'

కాకినాడసిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అట్టడుగుజాతుల విద్యాభివృద్ధికి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన మహాత్మా జ్యోతీరావ్ పూలే గొప్ప దార్శనీకుడని టీడీపీ కాకినాడ రూరల్ సమన్వయకర్త నులుకుర్తి వెంకటేశ్వర రావు అన్నారు. కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన పూలే వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. టీడీపీ కరప మండల అధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పూలే విగ్రహం వద్ద నివాళులు

పూలే వర్ధంతి సందర్భంగా శాంతిభవన్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుత్తుల రమణ, నాయకులు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు జోగారాజు, రాళ్లపూడిఅనిల్ పాల్గొన్నారు.

కరపలో..

కరప, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కరప పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న పూలే విగ్రహానికి ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మీసత్తిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. వలసపాకల సర్పంచ్ వాసంశెట్టి రామారావు, నాయకులు మేడిశెట్టి సత్తిబాబు, మంచాల శ్రీను, పితాని శ్రీను, కమిడి శంకర్, తుట్టా ప్రసాద్, వనుం భాస్కర్, వనుం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పిఠాపురంలో..

పిఠాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పూలే వర్ధంతి సందర్భంగా పిఠాపురంలోని వైసీపీ కార్యాలయంలో నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ వంగా గీత పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గొల్లప్రోలులో..

గొల్లప్రోలు రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎంపీడీవో కర్రి స్వప్న గురువారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

తాళ్లరేవులో..

తాళ్లరేవు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు అధ్యక్షతన పూలే వర్ధంతి నిర్వహించారు. టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ నివాళులర్పించారు.

సామర్లకోటలో..

సామర్లకోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

భీమేశ్వరాలయంలో విశేష కార్తీక పూజలు



సామర్లకోట భీమేశ్వరాలయంలో జ్యోతిర్లింగార్చన దృశ్యం

సామర్లకోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఇరవై ఏడోరోజు పురస్కరించుకుని గురువారం సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య అభిషేక, పుష్పార్చన పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచేగాక రాష్ట్రం నలుమూలల నుంచీ అధికసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని, స్వామివారిని దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. శ్రీపాద రాజశేఖర ఘనాపాఠి నేతృత్వంలో ఉప్పాడకు చెందిన ఉప్పాడ సురేష్ దంపతులు ఆశీనులయ్యారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద జరిగిన ఆకాశదీప పూజలలో పలువురు భక్తులు ఆశీనులయ్యారు. కార్తీకదీపారాధన సంఘ సభ్యులుచే జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. నిత్యాన్నదాన పథకంలో భాగంగా ఆలయ ఆవరణలో సుమారు 600 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. గురువారం రాత్రి ఆలయానికి విచ్చేసిన భక్తులకు సామర్లకోట లయన్స్ భీమేశ్వరా క్లబ్ సౌజన్యంతో చక్కెర పొంగలి, పులిహోర అల్పాహారం, వాటర్‌ప్యాకెట్లు పంపిణీ చేశారు.

పాదగయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

పిఠాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక ద్వాదశి, త్రయోదశి సందర్భంగా కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లకు కుంకుమార్చనలు జరిగాయి. భక్తులు పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు దీపాలు వెలిగించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

శృంగేరీ స్వామిజీని కలిసిన పాదగయ ఈవో

పిఠాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శృంగేరీ దక్షిణామ్నాయ శ్రీ శారదా పీఠం, జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం స్వామిజీ విధుశేఖర భారతి స్వామిని పిఠాపురం పాదగయ క్షేత్రం ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ కలిశారు. గండేపల్లి మండలం పి.నాయకంపల్లి విచ్చేసిన స్వామిజీని దేవదాయశాఖ ఆదేశాల మేరకు ఈవో కలిసి స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను, ప్రసాదాలను అందజేశారు.



పురుహూతికాఅమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో తనిఖీలు

ఒక షాపు లైసెన్స్ సస్పెన్షన్

గొల్లప్రోలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో జిల్లా వ్యవసాయాధికారుల బృందాలు గురువారం తనిఖీలు నిర్వహించాయి. స్థానికంగా స్రవంతి ఆగ్రోస్ దుకాణంలో జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ ఆదేశాల మేరకు టెక్నికల్ వ్యవసాయాధికారులు గాయత్రి దేవి, విజయలక్ష్మి, వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతి తనిఖీలు జరిపి రికార్డులు, నిల్వలు పరిశీలించారు. స్టాకు రిజిస్టర్లు, బిల్లు బుక్కులకు వత్యాసాలు ఉండడంతోపాటు పెస్టిసైడ్స్ యాక్టు ప్రకారం స్టాకు నిర్వహణ లేకపోవడం వంటి లోపాలను గుర్తించారు. దీనితో షాపు లైసెన్సును తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయాధికారుల తనిఖీలతో పట్టణం, మండలంలోని ఎరువులు, పరుగుల మందుల దుకాణాలను నిర్వాహకులు మూసివేశారు. తనిఖీల్లో గొల్లప్రోలు మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.



గొల్లప్రోలులోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పీహెచ్‌సీలకు ఆర్వో వాటర్ ప్లాంట్లు

పిఠాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులు, వారి సహాయకులు రక్షిత తాగునీటి కోసం ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో అన్ని పీహెచ్‌సీల్లో ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచనలకు అనుగుణంగా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నెల్లూరులోని శ్రీసిటీలో ఉన్న ఇండస్ కాఫీ ప్రవేట్ లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులతో ఐదు ఆర్వో వాటర్‌ప్లాంట్లును సమకూర్చింది. జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్ ఆదేశాల మేరకు ఈ ఆర్వో ప్లాంట్లను పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని చేబ్రోలు, మల్లాం, నాగులాపల్లి, విరవ, కొమరగిరి పీహెచ్‌సీలకు వికాస పీడీ లచ్చారావు గురువారం అందజేశారు. వీటి ద్వారా రోగులకు రక్షిత తాగునీటిని అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఆర్వో వాటర్ ప్లాంట్లను అందజేస్తున్న వికాస పీడీ లచ్చారావు

'రైతులు అప్రమత్తంగా ఉండాలి'

సామర్లకోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఐఎండీ సూచనలమేరకు నైరుతి బంగాళా ఖాతంలో వాయుగుండం ఉత్తరవాయువ్య దిశగా కదులుతూ తీవ్ర వాయుగుండంగా బలపడనున్నందున జిల్లా వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైతులు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ సహాయ వ్యవసాయ సంచాలకురాలు, ఎం.రత్నప్రశాంతి, సామర్లకోట మండల వ్యవసాయాధికారిణి ఐ.సత్యలు తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి ఎన్. విజయకుమార్ ఆదేశాలతో సామర్లకోట మండలంలోని పలు గ్రామాలలో వరిమాసూళ్లు, ధాన్యం ఆరబోత, తరలింపుల వంటి వ్యవసాయపనులను వారు గురువారం సందర్శించి రైతులను అప్రమత్తం చేశారు. ఇప్పటికే కోసిన పంటను ఎత్తైన ప్రాంతాలకు తరలించాలని, మాసూళ్లు చేసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. పంటకోత కోత ను రైతులు తాత్కాలికంగా వాయిదా వేసుకోవాల న్నారు. కోతలు కోసి కుప్పలుగా వేసిన వారు కుప్పలపై టార్పాలిన్లు, బరకాలు కప్పి కుప్పలకు రక్షణ కల్పించాలని ఏడీఏ రత్నప్రశాంతి, ఎంఏవో సత్యలు రైతులకు సూచించారు.

'సికా' ఏపీ డాక్టర్స్ విభాగం అధ్యక్షురాలిగా వరలక్ష్మి



పిఠాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సౌత్ ఇండియా కాపు అసోసియేషన్(సికా) ఏపీ డాక్ట ర్స్ విభాగం అధ్యక్షురాలిగా పిఠాపురం పట్టణానికి చెందిన వైద్యురాలు డాక్టర్ చిక్కాల వరలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు సికా ప్రధాన కార్యదర్శి, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పూరి శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని డాక్టర్ వరలక్ష్మి గురువారం తెలిపారు.

పవర్ ఛాంపియన్‌షిప్ విజేతకు కలెక్టర్ అభినందన

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 28(ఆంధ్ర జ్యోతి): ఆలిండియా నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ విజేత మందపల్లి శ్రీనివాసరావును గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అభినందించారు. పంజాబ్ ఖరార్‌లో జరిగిన రైతుబారా యూనివర్సిటీ నిర్వ హించిన ఆలిండియా నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో 550 మంది పవర్ లిఫ్టర్స్ పాల్గొనగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏపీఎస్ ఆర్టీసీ సంస్థలో కాకినాడ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావు 450కేజీల విభాగంలో ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. జనవరి 2025లో బెంగళూరులో జరిగే వరల్డ్‌వైడ్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు కాకినాడజిల్లా నుంచి ఎంపికైనా సందర్భంగా శ్రీనివాసరావుకు జిల్లా కలెక్టర్ అభినందించారు.



విజేతను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

సైబర్‌క్రైమ్‌పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి: డీఎస్పీ

తాళ్లరేవు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న సైబర్ క్రైమ్ నేరాలపట్ల విద్యార్థులు ప్రజలను చైతన్యపరచాలని కాకినాడ డీఎస్పీ రఘువీర్‌విష్ణు అన్నారు. గురువారం కాకినాడజిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు పటవల పైడా ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు డిజిటల్ అరెస్ట్, స్టాక్‌మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్‌ఫ్రాడ్, ఎంప్లాయ్‌మెంట్ ఫ్రాడ్, కెవైసీ ఫ్రాడ్‌లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ సైబర్ నేరాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీడియోలు, పోస్టర్‌లు విద్యార్థులకు చూపించారు. ఇవి వాట్సప్ గ్రూపులు ఇతర ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా సోషల్ మీడియాలో ప్రసారం చేస్తారన్నారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ, కళాశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో 'మెప్మా' బజారు

గొల్లప్రోలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో గురువారం మెప్మా బజారు నిర్వహించారు. పట్టణ పరిధిలో మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన వస్తువులను విక్రయానికి ఈబజారులో ఉంచారు. మెప్మా ఎండీ ఆదేశాల మేరకు ప్రతినెలా ఈ మెప్మాబజారు నిర్వహిస్తున్నట్లు టీపీఆర్‌వో భారతి తెలిపారు.

మద్యం తరలిస్తున్న నలుగురి అరెస్ట్

తాళ్లరేవు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): యానాం నుంచి అక్రమంగా మద్యంను తరలిస్తూ నలుగురు వ్యక్తులు పట్టుబడినట్లు ఎక్సైజ్ ఎస్ఐ నాగేంద్రకృష్ణ గురువారం తెలిపారు. శీల గ్రామానికి చెందిన వాసిరెడ్డి నూకరాజు 10మద్యం బాటిల్స్‌తో పట్టుబడ్డాడు. విజయవాడకు చెందిన ఇమిడి నాగరాజు 6మద్యం బాటిల్స్‌లను తరలిస్తూ పి.మల్లవరం చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డాడు. కట్టమూరుకు చెందిన పెట్ల వీరబాబు 5మద్యం బాటిల్స్ తాడేపల్లిగూడెంనకు చెందిన యర్లగడ్డ చంద్రశేఖర్ 11మద్యం బాటిల్స్‌ను ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా సుంకరపాలెం చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డారు. వీరి నుంచి మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని నలుగురిపై సీఐ కె. కోటేశ్వర్ కేసులు నమోదుచేశారు. ద్విచక్రవాహనంను సీజ్‌చేసినట్లు తెలిపారు.

సాయిబాబా ఆలయంలో మాజీ ఎమ్మెల్యే వర్మ పూజలు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడలోని సాయిబాబా ఆలయాన్ని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ గురువారం సందర్శించారు. ఆలయ 23వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని సాయిబాబాను దర్శించుకున్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

'బాల్య వివాహాలను జరగకుండా చర్యలు'

గొల్లప్రోలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు జరగకుండా చూస్తామని, దానివలన కలిగే దుష్ప్రభావాలు గురించి అందరికీ అవగాహన కల్పిస్తామని అన్ని ప్రభుత్వశాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు, సిబ్బంది సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు. ఐసీడీఎస్ పిఠాపురం ప్రాజెక్టు ఆధ్వర్యంలో గొల్లప్రోలు మండలపరిషత్ కార్యాలయంలో గురువారం బాల్య వివాహాల నిరోధక చట్టం, కిశోర వికాసం తదితర అంశాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు, విద్యాశాఖ, డీఆర్డీఏ, వెలుగు, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ తదితర మండలస్థాయి అధికారులు, సిబ్బంది, గ్రామస్థాయి అధికారులకు అన్ని విషయాలు గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీవో దుర్గాదేవి, గొల్లప్రోలు ఎంపీడీవో కర్రి స్వప్న, తహసీల్దారు సత్యనారాయణ, వైద్యాధికారి రామకుమార్, ఎస్ఐ రామకృష్ణ, ఏపీఎం సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో మహా అన్న సమారాధన

వీఆర్ పురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడ్డిగూడెంలో రుద్రకోటేశ్వర స్వామివారి ఆలయంలో (శివాలయం) గురువారం మహా అన్న సమారాధన నిర్వహించారు. వీఆర్ పురం గ్రామానికి చెందిన కడుపు రాము దంపతులు కార్తీక మాసం సందర్భంగా శివాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సుమారు మూడువేలకు మందికి పైనే అన్న ప్రసాదం స్వీకరించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

రబ్బరు రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని గిరిజన రబ్బరు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీలతో కలిసి మారేడుమిల్లి మండలం పూజారిపాకలులోని రబ్బరు ప్రాసెస్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన రబ్బరు రైతులకు ప్రాసెస్ యూనిట్ షెడ్లు, స్మోక్ రూమ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రబ్బరు రైతులు ఐదుగురు సభ్యులను ఎన్నుకుని సొసైటీ ఏర్పరచుకుని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మారేడుమిల్లి నేచురల్ ప్రొడక్షన్ ఫౌండేషన్ ద్వారా సుమారు 200 మంది సభ్యుల ఉన్నారని, వారికి రూ.10 కోట్లు మంజూరు చేయాలని పల్లల రాజ్‌కుమార్‌రెడ్డి, దోరి సోమయ్య, రామిరెడ్డి, కదల మొట్టిరెడ్డి, గొర్లె చిననారాయణరావు, గొర్లె మురళీకృష్ణ, గొర్లె అనిల్ ప్రసాద్, పి.జానకిరెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి కలెక్టరు స్పందిస్తూ పర్యవేక్షణకు నోడల్ అధికారిగా సబ్ కలెక్టర్‌ను నియమించనున్నట్లు తెలిపారు. మినీ పరిశ్రమల ఏర్పాటుకు గిరిజన సభ్యులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌వో కె.చిట్టిబాబు, ఏపీడీ జి.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, ఏఈ సత్యనారాయణ, ఎంపీడీవో విశ్వనాథ్, తహసీల్దారు బాలాజీ, ఏవో సీహెచ్‌కేవీ చౌదరి, సామాజిక కార్యకర్త బల్ల మోహన్, చిన్నిబాబు పాల్గొన్నారు.

ఒక్కో ఇంటికి రూ.10 లక్షలు పెంచి ఇవ్వాలి


హౌసింగ్ ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

దేవీపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ హౌసింగ్ కాలనీలో ఒక్కో ఇంటికి రూ.10లక్షలు పెంచి మం జూరు చేయాలని ఆదివాసీ జేఏసీ సభ్యులు, పారా లీగల్ వలంటీర్లు డిమాండ్ చేస్తున్నారు. గురువారం ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ దేవీపట్నం మండల పరిధిలో గతంలో గ్రామీణ హౌసింగ్ కాలనీ లో 161 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. అందులో 44 అసలు పూర్తి కాలేదని, 71 గోతులతో ఉన్నాయన్నారు. 10 ఇళ్లు పునాది దశలో ఉండగా 11 ఇళ్లు స్లాబు లేకుండా ఉన్నాయ న్నారు. ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.2.15 లక్షలు మంజూరు చేస్తోందన్నారు. ప్రస్తుతం మెటీరియల్ ధరలు, చార్జీలు అధికమయ్యాయని, అందువల్ల ఇళ్ల నిర్మాణం పూర్తికావట్లేదన్నారు. ఒక్కో ఇంటికి రూ.10 లక్షలు పెంచి మంజూరు చేస్తే నిర్మాణాలు పూర్తి చేసుకుంటామన్నారు. మంజూరైన ఇళ్లను ప్రభుత్వం తక్షణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు దేవీపట్నం హౌసింగ్ ఏఈ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ జేఏసీ నాయకులు యలగాడ నాగేశ్వరరావు, కారం రామన్నదొర, కుండ్ల సాయిరాం, నడిపూడి భానుశంకర్‌రెడ్డి, నడిపూడి గణపతిరెడ్డి పాల్గొన్నారు.


ప్రాజెక్టు నిర్మాణంలో కోల్పోయిన భూములను పరిశీలిస్తున్న రంగారెడ్డి

భూములిచ్చిన ఆదివాసీ రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

ఎటపాక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అలుగు వాగు ప్రాజెక్టులో పంట భూములు కోల్పోయిన చుట్టుపక్కల ఆదివాసీ రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు కెచ్చల రంగారెడ్డి, కెచ్చల కల్పన ప్రభుత్వాన్ని కోరారు. గురువారం వారు అలుగువాగు ప్రాజెక్టులో భూములు కోల్పోయిన ఆదివాసీ రైతులను అచ్చు తాపురం గ్రామంలో కలిశారు. రైతులతో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. 2013 భూసేకరణ చట్టప్రకారం ఆదివాసీలకు నష్టపరిహారం అందించాలని, లేకుంటే భూములు కోల్పోయిన రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. డివిజన్ నాయకుడు సాయన్న పాల్గొన్నారు.

అపార్ ప్రక్రియను సమర్ధవంతంగా పూర్తి చేయాలి

వై.రామవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలల్లో అపార్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఎంఈవో తాత బ్బాయిదొర ఆదేశించారు. గురువారం ఆయన మండల విద్యా శాఖ కార్యాలయంలో ఉపాధ్యాయులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అపార్‌కు సంబంధించి పెండింగులో ఉన్న విద్యార్థుల వివరాలను సేకరించి పూర్తి చేయాలన్నారు. ఎఫ్ఎ1, ఎఫ్ఎ2 మార్కుల జాబితాలను అప్‌లోడ్ చేయాలని, నూతన టైంటేబుల్ సెలక్షన్ విధానాన్ని అనుసరించాలని, 3,6,9 తరగతుల పరీక్షల నిర్వహణకు సిద్ధం చేయాలని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉండేలా హెచ్ఎంలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. పాఠశాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు.

2 నుంచి పీఎల్‌జీఏ వారోత్సవాలు

ఎటపాక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2 నుంచి 8వ తేదీ వరకు గ్రామగ్రామాన పీఎల్‌జీఏ వారోత్స వాలు జరుపుకోవాలని సూచిస్తూ మావోయిస్టు పార్టీ చర్ల- శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ పేరిట ఒక లేఖ గురువారం సామాజిక మాధ్యమాల్లో విడుదలైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన కగార్ యుద్ధాన్ని తిప్పికొట్టడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. దోపిడీరహిత సమాజ నిర్మాణానికి యువతీ, యువకులు పీఎల్‌జీఏలో చేరాలని పిలుపునిచ్చారు. వచ్చే నెల రెండో తేదీ నాటికి 24 సంవత్సరాలు పూర్తి చేసుకుంటోందని ఆ లేఖలో పేర్కొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



జగ్గంపేటలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న జనసేన ఇన్‌చార్జి రమేష్, తునిలో నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

జ్యోతిరావుపూలేకు నివాళి

జగ్గంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద గల పరివర్తన స్థలంలో ఆయన విగ్రహానికి జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పుష్పమాల వేసి నివాళులర్పించారు. మాదారపు వీరబాబు, కాయల మణికంఠ, సూరపరెడ్డి నరేష్, రాజనాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. జగ్గంపేట హైస్కూల్లోని పూలే విగ్రహానికి బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తుక నాగేశ్వరరావు పుష్పమాల వేశారు. వైసీపీ జగ్గంపేట మండల శాఖ అధ్యక్షుడు రావుల గణేష్‌రాజా, జగ్గంపేట టౌన్ అధ్యక్షుడు కాపవరపు ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గుర్రం మహాలక్ష్మి, మాజీ ఎంపీటీసీ గాది కృష్ణ, అడబాల నాగు, గిడియాల పెద్దకాపు, సాపిరెడ్డి సత్తిబాబు, పల్లపాటి రాజు, పైలా చైతన్య, పైలా నానాజీ, వడ్లపాటి జయబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక విద్యుత్ ఉప కేంద్రం వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి రాష్ట్ర ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) పుష్పమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కొండబాబును ఏలేశ్వరం, లింగంపర్తి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాగు గున్నబాబు, తాళ్ళూరు గొల్లాజీ, వి.నానాజీ, మామిడిపాక సతీష్, పులవర్తి శ్రీను, గ్రంధి శ్రీనివాస్, వాగుబుల్లి ఎల్లపరాజు, వి.దత్తు పాల్గొన్నారు.

తుని రూరల్ (ఆంధ్రజ్యోతి): ఎస్.అన్నవరంలో పూలే చిత్రపటానికి మాజీ మంత్రి దాడిశెట్టి రాజా పుష్పమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తుని పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో పూలే చిత్రపటానికి డీసీసీబీ మాజీ డైరెక్టర్ ముదునూరి మురళీకృష్ణంరాజు పుష్పమాల వేసి నివాళులర్పించారు. నాయకులు తోపాటి బాబ్జీ, గొనగాల బాబ్జీ, రామకృష్ణ, బొల్లు నాగేశ్వరరావు, కోలా తాతబాబు తదితరులు పాల్గొన్నారు.



పెండ్లి కుమారునిగా ఉమా రామలింగేశ్వరుడు

తొండంగి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం గ్రామంలో ఉమారామలింగేశ్వరుని కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె చేశారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం గ్రామవీధుల్లో పల్లకి సేవ జరిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

గండేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో మండలంలో జరుగుతున్న పనులను డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి గురువారం పరిశీలించారు. పశువులకు షెడ్ల నిర్మాణం, సీసీ రోడ్లు, డ్రైన్లు, పంట కాలువలో పూడికతీత పనులు పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. పూడికతీత పనిచేసే వారికి రూ.300 వేతనం వచ్చేలా కొలతల చూడాలన్నారు. ఏపీవో ఆర్.గంగాభవానీ, ఈసీ పి.రమేష్, సాంకేతిక సహాయకులు ఈ.శ్రీనుబాబు, కె.శ్రీను, ఇంజనీరింగ్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇందుకూరుపేటలో అన్నసమారాధన

దేవీపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట సమీపంలో కొండపై శ్రీషిర్డీ సాయిబాబా ఆలయం వద్ద గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఇందుకూరు, ఇందుకూరుపేట, లోతుపాలెం, బియ్యంపల్లి గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ప్రసాదం స్వీకరించారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

దేవీపట్నం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవీపట్నానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త చల్లా సత్యనారాయణ అనారోగ్యంతో కోరుకొండ మండలం గాదరాడలో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న దేవీపట్నం టీడీపీ నాయకులు అక్కడకి వెళ్లి సత్యనారాయణ పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గేదల వీరవెంకటసత్యనారాయణ, పెద్దసుబ్బారావు తదితరులు వున్నారు.


బసవేశ్వరుడికి అభిషేకం చేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి కుటుంబీకులు

బసవేశ్వరుడికి అభిషేకాలు

ప్రత్తిపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లిలో గల అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో కార్తీక బహుళ త్రయోదశిని పురస్కరించుకుని గురువారం ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) సతీమణి సుజాత, కుటుంబసభ్యులు వివిధద్రవ్యాలతో బసవేశ్వరుడికి అభిషేకాలు నిర్వహించారు. వారికి పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ నిర్వాహకుడు రామానంద స్వామి, ఏలేశ్వరం తాతాజీ, భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ప్రత్తిపాడులో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొమ్ముల మహేశ్వరరావు కార్తీక వనసమారాధన నిర్వహించగా స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బెండపూడి రైతులతో తహసీల్దారు సమావేశం

తొండంగి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విమానాశ్రయానికి భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తూ అమరావతిలో ఫిర్యాదు చేసిన బెండపూడి రైతులతో తహసీల్దారు మురార్జీ గురువారం సమావేశమయ్యారు. రెవెన్యూ కార్యాలయంలో వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. తామంతా సన్న, చిన్నకారు రైతులమైనందున తమ భూములను విమానాశ్రయానికి సేకరించవద్దని ముక్తకంఠంతో విన్నవించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇవ్వమని తెగేసి చెప్పారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి పంపుతామని తహసీల్దారు చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

జగ్గంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 12 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ఐదు లీటర్ల నాటుసారాతో వ్యక్తి అరెస్టు

గండేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయకంపల్లి గ్రామానికి చెందిన కె.ప్రసాద్‌ను గురువారం ఐదు లీటర్ల నాటుసారాతో అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివనాగబాబు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు.

ఉచితంగా వైద్య పరీక్షలు

ఏలేశ్వరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అపోలో ఫార్మసీ వద్ద రాజమహేంద్రవరానికి చెందిన వేద హాస్పిటల్ వైద్యుడు తేజో ఫణీంద్ర సుమారు 90 మందికి ఎముకల వైద్య పరీక్షలు చేశారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు.



అగ్ని ప్రమాద బాధితులకు సాయం

కూనవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చూచిరేవుల గూడెం గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన తెల్లం ముత్తయ్య కుటుంబానికి జనసేన నాయకుడు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడ బండారు సాంబశివరావు నిత్యావసర వస్తువులు అందజేశారు. మచ్చా వినయ్ రూ.వెయ్యి సాయం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కుంజా అనిల్, జి.పండు, లక్ష్మణ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిరావుపూలేకు నివాళి

వై.రామవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పి.యర్రగొండ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో గురువారం జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. ఆయన సేవలు, రచనలు, నిరాడంబర జీవనాన్ని ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ విద్యార్థులకు వివరించారు. పూలే చిత్రపటానికి పుష్పమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వీఆర్ పురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమట్టపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దారు సరస్వతి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు దళారుల మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి రఘు, ఆర్ఐ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.



షష్ఠి మహోత్సవాలకు శ్రీకారం

శంఖవరం, నవంబరు 28: (ఆంధ్రజ్యోతి): స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దివ్య కల్యాణోత్సవాలను శుక్రవారం నుంచి డిసెంబరు 8వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పందిరి రాట వేశారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు హాజరు కాగా ఆలయ అర్చకుడు శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని జరిపించారు. పాల కావిడి ఉత్సవం, పూజలతో పాటు భారీ అన్నదానం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలి

శంఖవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కత్తిపూడి, శంఖవరం గ్రామాల్లో వరి చేలను వ్యవసాయాధికారి పి.గాంధీ గురువారం పరిశీలించారు. వచ్చే ఆదివారం వరకు తుఫాను హెచ్చరికల నేపథ్యంలో కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. నూర్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతంలో నిల్వ చేసుకోవాలన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. సహాయకులు ప్రభాస్, చిన్న, విలియం, వికాస్ పాల్గొన్నారు.